# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ..

ఏప్రిల్ 2023



**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామక్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీలల ధారావాహికం**





మొదటి భాగం

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ .. నా దశ !

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామక్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

- పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవింద దాసు)





తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నా ప్రభువు. నేను ఆయన సేవకుడను. నేను చేసే ప్రతి పనికి కర్త, కర్మ, క్రియ తిరుమల శ్రీవేంకటేశ్వరుడే. నా భాగ్య వశాత్తు నన్ను తన పనిముట్టు లాగ ఎంచుకొని, కొన్ని వేల అనుభూతులను, లీలలను చూపి ధన్యుణ్ణి చేశాడు. శ్రీవేంకటేశ్వరుని లీలలను అర్థం చేసుకొనుట చాల కష్టం. శ్రీవేంకటేశ్వరుని పైన ప్రమాణము చేసి చెప్పుచున్నాను, నేను అర్థం చేసుకున్నంత వరకు, ఎలాంటి కల్పితములు లేకుండ వ్రాయుచున్నాను. దీనిలో భగవంతుడి గురించి భక్తుడు చెందే తపన తెలుస్తుంది. ప్రతి లీల శ్రీవేంకటేశ్వరుని గురించి తపనే లక్ష్యంగా సాగింది. 2000 సంవత్సరము నుండి నేటి వరకు వరుసగా 10 రోజులు ఆయన లీలలను చూడక ఉండలేని స్థితిని కలిగించారు.

నేను తెలుపు ప్రతి విషయము సత్యం. నేను అనుభవించింది మాత్రమే, నా వద్ద స్వామివారు కల్పించిన 500 లకు పైగా అనుభూతులు వ్రాసి ఉన్నవి. ఎవ్వరైన ఎప్పుడైన వచ్చి చూడవచ్చును. నిజానికి మేము వేలాది అనుభూతులను చూచినప్పటికీ 500 అనుభూతులను మాత్రమే వ్రాశాము. ఈ భాగములో స్వామివారి సంకల్పమును, ప్రసాదించిన సేవలను, మొత్తం గత 23 సంవత్సరముల సారాంశములను సంగ్రహంగా తెలుపుచున్నాను.

## స్వామివారి లక్ష్యం!

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. వైకుంఠం విడిచి, తిరుమల కొండపై, కలియుగ మానవుల ఉద్ధరణకై వెలసి ఉన్నాడు. ఆయన భక్తప్రియుడు, భక్తవత్సలుడు. భక్తుల ఉద్ధరణే లక్ష్యంగా చేసుకొని తన లీలలను ప్రసరించుచుండును. లోకంలోని సర్వ కార్యములు ఈయననే నిర్వహించునప్పటికీ, వాటిని తాను కాకుండా తన భక్తులచే నిర్వహింప చేయుచు, ఆ కీర్తి ప్రతిష్ఠలను భక్తులకు అంటకట్టి, వారు ఆనందించుటను చూచి ఈయన ఆనందించును.

శ్రీమన్నారాయణుడు తన భక్తుల ఉద్ధరణ కోసమని ఈ భూమండలములో, ముఖ్యంగా మన భారతదేశంలో రకరకాల ప్రాంతాలలో వెలసి భక్తులను అనుగ్రహించుచున్నారు. ఇలా రకరకాల ప్రాంతాలలో రకరకాల రూపాలలో తాను తన సొంత ఇచ్ఛతో, స్వయంభూ రూపకంగా, స్థాపిత రూపకంగా వెలుస్తున్నప్పటికీ, ఆ కీర్తిని కొందరి భక్తులకు ఆపాదించుటకై వారి మనస్సులో స్వామివారిని పొందవలెనన్న బలమైన కోరికను ఏర్పరచి, తపస్సు మొదలగు సాధనాల ద్వారా ఆ భక్తుడు యోగ్యతను సాధించుకొన్న తరువాత, ఆతని ఇష్టదైవంగా ప్రత్యక్షమై, ఆ భక్తుని ప్రార్థన మేర ఆ క్షేత్రములో స్థిర నివాసమేర్పరచుకొన్నారు. ఉదాహరణకు, భద్రాచలంలో భద్రుడనే ఋషి యొక్క తపస్సుకు మెచ్చి, అతని ఆరాధ్యుడైన శ్రీరామునిగ దర్శనమిచ్చి, తన అంశను అక్కడ స్థిరీకరించాడు. మరియు యాదగిరి అనే మరో భక్తుడు తపస్సు చేసి, యోగ్యత పొంది, తన ఇష్టదైవమైన లక్ష్మీనరసింహుని పొంది, యాదగిరి క్షేత్రాన్ని ఏర్పరచుటకు కారకుడైనాడు. నిజానికి ఈ ఇద్దరికీ వారి వారి ఇష్టదైవాలను పొందవలెనన్న కోరికను కలుగజేసి, వారిని మధ్యవర్తిగా ఎన్నుకొని తన పనిని సాధించుకొన్నాడు. అదేవిధంగా ఈరోజు శ్రీమన్నారాయణుడైన శ్రీవేంకటేశ్వరుడు ఈ ప్రాంత ప్రజల ఉద్ధరణకై మా సొంత గ్రామమైన చిన్నగుండవెల్లి గ్రామము (సిద్ధిపేట జిల్లా) లో తిరుమల శ్రీవేంకటేశ్వరుని రూపంగా వెలవ దలచి, నన్ను ఒక పనిముట్టు లాగా ఎంచుకొని, నాకు ఆయనను పొందాలనే కోరికను కలుగజేసి, తగిన యోగ్యతను సాధించుటకు అవసరమైన భగవత్ సేవలనే తపస్సులను, సాధనను కల్పించి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించుచు, తప్పులను సరి చేయుచు, నన్ను సన్మార్గంలో పయనించేటట్లు చేయుచు, చివరికి తన లక్ష్యాన్ని నెరవేర్చుకొనుటకు చేసే ప్రయత్నంలో భాగమే నాకు కల్పించిన వేల అనుభూతుల సారము.

కలియుగ మానవులు తరించాలంటే హరినామ స్మరణ ఒక్కటే ఏకైక మార్గము. అందునా ఈ కలియుగపు అధినాయకుడైన తిరుమల శ్రీవేంకటేశ్వరుని నామస్మరణతో మరింత తొందరగా పునీతుడు కాగలడు. కావున చిన్నగుండవెల్లి గ్రామము లోని మా తోటబావి వద్ద తన "హరినామ క్షేత్రము"ను స్థాపించమని, తిరుమల ఆలయము యొక్క ప్రతిరూపమును కనీసము రెండు ప్రాకారాల వరకైన నిర్మించమని ఆదేశించారు. తాను స్వయంగా తిరుమల నుండి ఒక అంశగా విచ్చేసి ఇక్కడ స్థిర నివాసమేర్పరచుకొందునని కూడా సూచించారు. భక్తులకు ఇది ఒక సాధనాలయము లాగ ఉండునని కూడా తెలిపారు. భక్తులను ఆకర్షించి, వారిని తగిన విధంగా అనుగ్రహించగలడనే విశ్వాసాన్ని కలుగ జేశారు.

చిన్నగుండవెల్లిలోని మా తోటబావి వద్ద కనీసం 7 ఎకరముల స్థలములో తిరుమల ప్రతిరూప ఆలయాన్ని నిర్మించుటతో పాటు భక్తులకు వసతి, భోజన సదుపాయములను ఏర్పరచుచు, స్వామివారి అఖండ హరినామ స్మరణను ఏర్పాటు చేయుట నా కర్తవ్యం.

ఇది చూచుటకు మామూలు విషయము లాగా కనిపించవచ్చు. ఎందుకంటే ఎంతోమంది భక్తులు శ్రీవేంకటేశ్వరుని ఆలయాలను నిర్మించారు. కేవలం అక్కడ అఖండ హరినామ స్మరణను ఏర్పాటు చేస్తే సరిపోతుంది. కాని ఈ విషయంలో స్వామివారి సంకల్పము భిన్నంగా ఉంది. ఈ క్షేత్రం అత్యంత మహిమాన్వితంగా, ఒక దివ్యక్షేత్రం లాగా, మరో తిరుపతి లాగా ఉండాలనుకుంటున్నాడు. భక్తులను కూడా తిరుపతిలో అనుగ్రహించినట్లే అనుగ్రహించుదు ననుకుంటున్నాడు. పైగా తాను తిరుమల నుండి ఇక్కడికి వచ్చుచున్నారు కావున అక్కడి పరిస్థితులను యథావిధంగా కల్పించాలి. అంటే ఆలయ నమూనా, ఆరాధనా విధానం మొత్తం తిరుమలలో మాదిరిగా ఉండాలని కోరాడు. ఇది ఆయన సంకల్పం. దీనిని సాధించుటే లక్ష్యంగా నన్ను ఒక పనిముట్టు లాగ ఎన్నుకొన్నాడు. లక్ష్యాన్ని సాధించే విధంగా కావలసిన శిక్షణను 2000 సంవత్సరము నుండి ఇవ్వడం మొదలు పెట్టాడు.

పూర్వం ఋషి భద్రుడు మరియు ఋషి యాదగిరి ఏకాంతంగా తపస్సు చేసి యోగ్యతలను సాధించి భగవంతుణ్ణి పొందారు. మరి ఈ కలియుగములో, జనాల మధ్యన నివసించుచు వారితో సహవాసము చేయుచు భగవంతుణ్ణి పొందే యోగ్యతను సాధించటం నాలాంటి ఒక అత్యంత సాధారణ మానవునికి సాధ్యమా? అసలు ఈ కలియుగములో శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రత్యక్షంగా పొందగలమా? అనే ప్రశ్నకు ఒక్కటే సమాధానం. శ్రీవేంకటేశ్వరుణ్ణి పొందాలనే సంకల్పం నాదైతే అది సాధ్యం కాదు. కాని ఈ సంకల్పం సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరునిదే అయితే అందులో ఎలాంటి సందేహము లేదు. పూర్వం హాథీరాం బావాజీ, తరిగొండ వేంగమాంబ గారలు శ్రీవేంకటేశ్వరుని ప్రత్యక్షంగా పొందారని, ఋజువులు కూడా కలవు. వీరే కాక మరెందరో పొందారు. కాని నిజమైన భక్తులు బయటికి రారు. శ్రీవేంకటేశ్వరుడు తలచుకుంటేనే ఆ భక్తుడు బయటి ప్రపంచానికి పరిచయమవుతాడు. ఇది సత్యం.

శ్రీవేంకటేశ్వరుడు తన ప్రత్యక్ష లీలలను 2000 సంవత్సరము నుండి చూపుట ప్రారంభించినప్పటికీ, పరోక్షంగా నా పుట్టుక నుండే ఈ జీవితంలో నన్ను ఉపయోగించి సాధించబడే లక్ష్యంను దృష్టిలో ఉంచుకొని దానికి తగినట్లుగ నాకు జన్మ, రూపురేఖలు, వ్యవహారము, అభిరుచులు అన్నీ ఆయన నిర్ణయించినట్లుగా లభించాయి. ఇందులోని ప్రతి ఒక్క అంశము ఈ లక్ష్యానికి ఎంతో అవసరమని నేను గ్రహించాను. ఈ లక్ష్య సాధన కోసమనే, స్వామి వారిని ఆ ప్రాంతానికి తెచ్చుటకై నాకు చిన్నగుండవెల్లిలో జన్మనిచ్చి, హైదరాబాదులో పోషించుచు, హరిసేవను నిర్వహింప చేయుచున్నాడు. దీని పుణ్యముతో తిరిగి ఊరికి వెళ్ళి శ్రీవేంకటేశ్వరుని కృపను ఆ ప్రాంతపు ప్రజలకు పంచుట

నా కర్తవ్యంగ నాకు దిశా నిర్దేశం చేశాడు. మొదట అత్యంత దయనీయ స్థితిలో ఉన్న మా కుటుంబాన్ని మాత్రమే, ఇంజనీరింగ్ చదివి, వ్యాపారం చేసి, డబ్బు సంపాదించి ఉన్నత స్థితికి చేర్చాలని నిర్ణయించి హైదరాబాద్ వచ్చాను. కాని మనిషి జీవించుటకు డబ్బే ప్రధానము కాదని, భగవంతుని కృప ప్రధానమని, మరియు ఈ కృపను మీ కుటుంబంతో పాటు ఆ ప్రాంత సర్వులకూ పంచిపెట్టమని, దిశా నిర్దేశం చేశాడు. నేను స్వామివారి లీలలను 2000 సంవత్సరము నుండి అనుభవించుచున్నప్పటికీ, ఆయన సంకల్పమును మాత్రం 2022 సంవత్సరం ఏప్రిల్ లో మాత్రమే తెలియజేశాడు.

పూర్వం భగీరథుడు గంగను దివి నుండి భువికి తెచ్చుటలో ప్రధాన పాత్ర పోషించాడు. కాని ఆయన ఒక్కడితోనే ఆ పని సంపూర్ణంగా సాధ్యం కాలేదు. అందులో వారి పూర్వీకుల తపః ఫలం తోడై మాత్రమే ఈయన విజయం సాధించినట్లు, తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి, తిరుమల నుండి చిన్నగుండవెల్లి లోని హరినామ క్షేత్రమునకు తెచ్చుటలో నేను ప్రధాన పాత్రను పోషించుచున్నప్పటికీ, ఇందులో మా తల్లితండ్రులు, భార్యాబిడ్డలు, వంశస్థులు, గ్రామస్థులు, ఆ ప్రాంత ప్రజలు, శ్రీవేంకటేశ్వరుని అఖండ భక్త జనము వారి వారి పాత్రను సమయానుసారము నిర్వహిస్తారని స్వామివారు సూచించారు.



కీ.శే పుల్లగూర్ల వెంకటరెడ్డి



కీ.శే పుల్లగూర్ల రుక్కమ్మ



## నా పరిచయం :

నా పేరు పుల్లగూర్ల సాయిరెడ్డి. తేది 05-07-1960 తొలి ఏకాదశి రోజున జన్మించాను. నా తల్లితండ్రులు కీ.శే పుల్లగూర్ల వెంకటరెడ్డి, రుక్కమ్మ దంపతులు. నాకు ఒక చెల్లెలు లలిత. ఇద్దరమే సంతానం. మాది సిద్ధిపేటకు 7 కిలోమీటర్ల దూరమున గల చిన్నగుండవెల్లి గ్రామము. పూర్తిగా వ్యవసాయ ఆధారిత కుటుంబము. 1981వ సంవత్సరములో కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ఉస్మానియా విశ్వవిద్యాలయములో సివిల్ ఇంజనీరింగ్ విద్యనభ్యసించుటకని హైదరాబాద్ వచ్చాను. 1985 వ సంవత్సరములో సివిల్ ఇంజనీరింగ్ లో పట్టా పొంది, 1987 నుండి అదే కళాశాలలో స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ లో పార్ట్ టైం చదివి యం.టెక్ మాస్టర్ డిగ్రీ పట్టా పొందాను. 1990 లో హైదరాబాద్ వాస్తవ్యులైన చెఱుకుపల్లి నారాయణరెడ్డి, శకుంతలాదేవి కుమార్తె, యం.ఎస్సీ కెమిస్ట్రీ చదివిన, సురేఖారెడ్డితో వివాహం జరిగింది. ఇద్దరు పుత్రులు, వేదాంత్ మరియు అరవింద్ రెడ్డి. మా తండ్రి 1990 సంవత్సరములో మరియు మా తల్లి 2008 సంవత్సరములో స్వర్గస్థులైనారు.

విద్యాభ్యాసము తరువాత ఉద్యోగము చేయుట ఏమాత్రం ఇష్టం లేని నేను కన్స్ట్రక్షన్ రంగంలో బిల్డరుగ 1990 నుండి వ్యాపారము చేయుచు హైదరాబాదులో జీవిస్తున్నాను. 1999 సంవత్సరము నుండి శ్రీవేంకటేశ్వరుని లీలల వలన, వ్యాపారమును సగానికి తగ్గించాను. 2002 నుండి 2014 వరకు కేవలం నా కుటుంబ పోషణార్థమే వ్యాపరము చేయుటకు అనుమతించారు. 2014 సంవత్సరము నుండి స్వామివారి ఆజ్ఞచే నా వ్యాపారాన్ని పూర్తిగా మానివేశాను. ప్రతినెల వచ్చు కొన్ని చాలీ చాలని కిరాయిలతో జీవనము కొనసాగుచున్నది. నా పూర్తి ఆర్థిక భారాన్ని స్వామివారే చూచుకుంటానన్నారు. అవసరమున్నంతనే ప్రసాదించుచుందురు. కాకతీయనగర్, హబ్సీగూడ, హైదరాబాదులో స్వామివారు ప్రసాదించిన ఇంటిలో 2005 సంవత్సరము నుండి నివసించుచున్నాము. మా ఇంటి నుండి అర కిలోమీటరు దూరములో హబ్సీగూడలోని వీధి నెం.1 లో ఆఫీసు కలదు. మా పెద్ద కుమారుడు చి॥ వేదాంత్, అతని భార్య చి॥ సౌ॥ పూజ మరియు చిన్నకుమారుడు చి॥ అరవింద్ రెడ్డి అతని భార్య చి॥ సౌ॥ ప్రణీత అమెరికాలో నివసించుచున్నారు. ఇది మా కుటుంబం.

## స్వామివారి శిక్షణ :

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నన్ను తన సేవకుడిగ స్వీకరించి సైనికుడిగ శిక్షణనిచ్చాడు. ''వన్ మాన్ ఆర్మీ'' లాగా తయారు చేసి లక్ష్యాన్ని ఛేదించమన్నాడు. ఏ విధంగానైతే యుద్ధంలో కాలం గడిచినకొద్దీ క్రొత్త క్రొత్త టెక్నాలజీలతో ప్రతి 4-5 సంవత్సరములకు ఒక్కసారి నూతన ఆయుధాలు పుట్టుకొచ్చినప్పుడు వాటికి తగిన శిక్షణను సైనికునికి ఇచ్చి నిష్ణాతుని చేయునట్లు, నాకు కూడ 2000 సంవత్సరం నుండి 2023 వరకు 6 సేవలను ప్రసాదించి ప్రతి సేవ ఏ విధంగా సమర్థవంతంగా నిర్వహించాలనే శిక్షణను ఇచ్చారు. ఏడవ సేవగా యోగ్యత పొంది తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి ఆహ్వానించి చిన్నగుండవెల్లిలో హరినామ క్షేత్రం ఏర్పాటు చేయుటకు కావలసిన శిక్షణను ఇచ్చుచున్నారు. గత 6 సేవలను శ్రీవారి కృపతో సమర్థవంతంగా విజయం సాధించాను. ఈ ఏడవ సేవలోను స్వామి కృపతో విజయుణ్ణి కాగలనని ఆశించుచున్నాను. ఆ ప్రయత్నంలో భాగమే నా ఈ అనుభూతుల ప్రచురణ. నిజం చెప్పాలంటే స్వామివారు నన్ను ఎన్నుకొనుటలో నా పూర్వజన్మ సుకృతము లాంటి గొప్పతనము ఉంటే ఉండవచ్చు, కాని ఈ శ్రీవారి సేవలయందు విజయమును సాధించుటలో నా శక్తి ఎంత మాత్రము లేదు. నేను ఒక సాధారణ మానవుణ్ణి. నేను స్వామివారి సేవను 2002 సంవత్సరంలో ప్రారంభించినప్పుడు ఎంత ఉత్సాహంతో ఉన్నానో, 2023 సంవత్సరంలో కూడా అంతే ఉత్సాహంగా ఉన్నానంటే శ్రీవేంకటేశ్వరుని శక్తే కారణం.

ప్రతిరోజు స్వామివారిని, ఆయన లీలలను చూడాలని తహతహ లాడేవాడిని. వరుసగ 10 రోజులు స్వామి లీలలను చూడకుండ ఉండలేని స్థితి కలిగించారు. నా దురదృష్టమో, అదృష్టమో తెలియదు కాని స్వామి లీలలను పొందిన తరువాత, దాని ప్రభావము ఒక వారం, పది రోజులు మాత్రమే ఉండి తరువాత మరచేవాడిని. మళ్ళీ క్రొత్త లీల కావాలని కోరేవాడిని. ఈ స్థితి గత 23 సంవత్సరముల నుండి నేటివరకు కొనసాగుచున్నది.

స్వామివారు తన ప్రత్యక్ష లీలలను 2000 సంవత్సరము నుండి చూపుట ప్రారంభించారు. నాకు వ్యాపారము పైన, నా భార్యకు కుటుంబం పైన ఎక్కువ ఇష్టాలు ఉండేవి. వీటిని ఉపయోగించి మాకు ఇష్టమున్న వాటిలో వచ్చిన చిక్కులను, కష్టాలను తీర్చుచు మాకు అత్యంత ప్రీతిపాత్రుడైనాడు. ముఖ్యంగా నేనైతే స్వామి నామము పలికితే శరీరములోని రోమాలు నిక్కబొడుచుకుని, ఆనంద బాష్పాలు రాల్చేవాడిని. నేను జీవించుటకు శ్వాస ఎంత అవసరమో స్వామి నామం కూడా అంతే అవసరమన్న స్థితికి వచ్చాను. నేను ఎవరిని చూచినా మూడు నామాలు పెట్టుకున్నట్టుగనే కనబడేవారు. ఈయన సర్వశక్తిమంతుడు. సమస్త దేవీ దేవతల శక్తులను, రూపాలను తనలో ఇముడ్చుకొని ఉన్నాడని, ఈయన ఒక్కరిని స్మరించితే సమస్త దేవీ దేవతలను స్మరించిన పుణ్యం వస్తుందన్న జ్ఞానాన్ని కలుగజేశాడు. నేను సర్వదా మానసింగా తిరుమల ఆలయంలో ఉన్న మూల మూర్తిని మాత్రమే దర్శించి స్మరించేవాడిని. ఆ రూపమే నాకు కావలసిన శక్తిని, జ్ఞానాన్ని ప్రసాదించింది. ఒక వ్యక్తి తాను స్వయంగా చెబితే తప్ప, భగవంతుడు అతని హృదయములోని భావాలను తెలుసుకోలేడు అనే స్థితి నుండి నాకు శిక్షణ ఇచ్చుటను ప్రారంభించాడు.


నాకు ఇంతవరకు శ్రీవేంకటేశ్వరుడు తప్ప ఇతర గురువు లేడు. ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాక, నేనెవ్వరి వద్ద సమాశ్రయణము తీసుకోలేదు. కాని శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి వారు తిరుపతిలో 2003 సంవత్సరములో ''గోవింద దాసు''గ, మరియు 2004 సంవత్సరములో హైదరాబాద్ లో శ్రీశ్రీశ్రీ వ్రతధర్ నారాయణ రామానుజ జీయర్ స్వామివారు ''గోవింద రామానుజ దాసు''గ దాస్య నామాలు ఇచ్చిన గురువులు.

తిరుమలలోని ఆలయంలో శ్రీవేంకటేశ్వరునితో పాటు ఇతర దేవతలు ఉన్నప్పటికీ, శ్రీవేంకటేశ్వరుని రూపాలే సమస్త దేవతలని, వీరిని పూజిస్తే మిగిలిన అందరినీ పూజించినట్లే అని భావించి ఇతరములైన ఏ రూపానికీ ప్రత్యేక పూజలు చేయరు, ఒక్క శ్రీవేంకటేశ్వరునికి తప్ప. ఇదే జ్ఞానాన్ని నాకు కలగజేశాడు. నేను సర్వదా ఆయన పాదాలను చూచుచు, ఆయన నామాన్నే స్మరించేవాడిని. అదే నా మహామంత్రము, శక్తి, ఆధారం, ప్రేరణ. ఒకవిధంగా నేను భగవద్గీత చరమ శ్లోకమును మాత్రమే ఆచరించేవాణ్ణి. శ్రీవేంకటేశ్వరుడే మూలం అని నమ్మేవాడిని. 2005 సంవత్సరంలో మాత్రం తాను స్వయంగా శ్రీమన్నారాయణుడననే విషయాన్ని తెలిపారు. అయినా నా దృక్పథంలో మార్పు కలగలేదు. శ్రీవేంకటేశ్వరుని నేను నా స్వామిగ, ఈ సృష్టికి మూలంగా, సర్వశక్తిమంతుడుగ భావించాను. కావున స్వామివారికి చిన్న చిన్న సేవలను చేసినచో తృప్తి చెందేవాణ్ణి కాదు. ఆయనకు నేను ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా అలసిపోయేటట్లు అత్యంత పెద్ద మొత్తంలో సేవలను చేయాలనిపించేది. పూర్వం బాణాసురుని యుద్ధ కాంక్ష లాగా నాలో శ్రీవారి సేవాకాంక్ష నా రోమ రోమాల్లో పొగలు కక్కుతూ ఉంటుంది. ప్రతి సేవకు స్వామివారే మూలం కావున నేను కేవలం స్వామివారి ప్రతినిధిగ, సేవకుడిగ చేయుచున్నాను, కావున ఎలాంటి సన్మానాలను ఆశించలేదు. వీలుకాని సమయంలో శ్రీవారి శేష వస్త్రంను మాత్రమే స్వీకరించేది. ఏనాడు మోక్షాన్ని కాంక్షించలేదు. మరి నాలుగైదు జన్మలు మానవ జన్మను ప్రసాదించి ప్రతి జన్మలో, ఈ జన్మలో లభించిన సేవా భాగ్యాన్ని ప్రసాదించుమని మరి మరి వేడుకునే వాడిని.

2000 సంవత్సరంలో మొదలైన స్వామి స్మరణ వల్ల కలిగే ఆనంద స్థితి నాకు రెండు రకాల దృష్టి కోణాలను ఏర్పాటు చేసింది. బయటి లోకమును చూచుచు, బయటి ప్రపంచంలోని వ్యక్తులతో మాట్లాడుచున్నప్పటికీ, సదా అంతర్ దృష్టితో స్వామివారిని

వీక్షించుచు, ఆయన నామ స్మరణను కొనసాగించేవాడిని. 2001 సంవత్సరంలో ఒకానొక రోజు నా ఆస్తి విషయములో తలెత్తిన సమస్యను తీర్చుమని ప్రార్థించే క్రమములో, ఒకానొక భావోద్వేగ స్థితిని పొంది, వారికి సంపూర్ణ శరణాగతి చేశాను. నాది నేను సమర్పించుకొనుటతో పాటు, నా సంపూర్ణ ఆస్తిని, నా మొత్తం కుటుంబాన్ని ఆయనకు సమర్పించాను. నేను నా వ్యక్తిత్వాన్ని కోల్పోయాను. నేను నీ వాడినని, నాకున్నదంతా తమదేనని చెప్పుచు, నన్ను ఈ లోకమునకు ఉపయోగపడే ఏదేని మంచి పనికి ఉపయోగించుకొమ్మని దీనాతి దీనంగా ప్రాధేయపడ్డాను. అప్పటి నుండి నాది నేను శ్రీవేంకటేశ్వరుడి పాదసేవకుడిగ భావించుచు జీవించసాగాను. మరియు ఆయన కృపావిశేషం చేత మా మధ్యన ఒక బంధం ఏర్పడింది. ఆ బంధం ప్రకారం నా మనస్సులో పుట్టిన ప్రతి ఆలోచన స్వామిదై ఉండాలి. నేను ఆ ఆలోచన ప్రకారమే నడచుకోవాలి. అది మంచిదా చెడ్డదా అనే విచక్షణ నాకు అవసరం లేదు. నేను ఆయన సేవకుడను. ఆయన ఆజ్ఞానుసారం నడచుకొనుట నా కర్తవ్యం. ఇదే ఆలోచన నా మొత్తం జీవితాన్ని మార్చేసింది. స్వామి రకరకాల సేవలను ఏర్పాటు చేయుటకు నాందిగా ఏర్పడింది.

ఆ తరువాత తిరుమల శ్రీవేంకటేశ్వరుడు కూడ నాకు ఒక కర్తవ్యాన్ని ఏర్పరచాడు. అదేమిటంటే తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ప్రసాదించిన ప్రతి అనుగ్రహాన్ని నేను అనుభవించి, తిరిగి దానిని తన భక్తులు అనుభవించేటట్లు చేయుట నా కర్తవ్యం. నేను పొందిన స్వామి కృపను ఎంత సమర్థవంతంగా, ఆయన భక్తులు తిరిగి అనుభవించేటట్లు చేయుదునో అంతగా స్వామివారు సంతోషించేవారు, అదే నా కర్తవ్యంగా సామర్థ్యానికి నిదర్శనంగా ఎంచుకున్నాను. మొదట్లో అంటే 2000 సంవత్సరం నుండి 2002 వరకు స్వామివారితో నా బంధం ఒక ఆత్మీయ బంధం లాగా



ఏర్పడింది. నా ప్రతి ప్రశ్నకు జవాబిచ్చేవాడు. 2002 సంవత్సరం నుండి 2005 వరకు నన్ను ఒక ప్రత్యేకమైన పని నిమిత్తం తీసుకెళ్ళుచున్నారని గ్రహించాను. 2008 వరకు నా సర్వదాస్తిని హరించి వేసి తాను చెప్పినట్లు మాత్రమే నడుచుకోమన్నాడు. 2009 నుండి యోగ్యతను సాధించుకోమన్నాడు. సాధన పెంచమన్నాడు. ఆధ్యాత్మికంగా ఎదగమని చెప్పాడు. ఇదే స్థితి నేటివరకు కొనసాగుచున్నది. ఏదేని చెడు ఆలోచన, స్వామికి ఇష్టం లేని ఆలోచన, ఈ సంకల్పానికి విరుద్ధమైన ఆలోచన నా మనస్సుకు వచ్చినప్పుడు వెంటనే దానిని వదులుమని సూచించేవాడు. శ్రీవేంకటేశ్వరుడు నన్ను, తను ఆశించిన స్థితికి తీసుకు రావటానికి ఆయా సమయాలలోని నా మానసిక స్థితికి అనుగుణంగా, సామ దాన బేధ దండోపాయాలను ఉపయోగించాడు. మరణం అంచుల వరకు తీసుకెళ్ళిన సందర్భాలు ఉన్నవి. కత్తిని మెడపై పెట్టి చేస్తావా? చస్తావా? అని అడిగిన సందర్భాలు ఉన్నాయి.


మా జీవితంలో స్వామివారి ప్రత్యక్ష లీలలు 2000 సంవత్సరం నుండి ప్రారంభమైనాయి. ఆయనకు సేవ చేయు భాగ్యము మాత్రము 2002 సంవత్సరము నుండి ప్రారంభమైంది. మొదట నన్ను శ్రీ ఆంజనేయుణ్ణి ఆదర్శంగా తీసుకొని సేవ చేయమన్నాడు. అంటే శ్రీ ఆంజనేయుడు శ్రీరాముణ్ణి ఏవిధంగా తన స్వామిగా భావించి ఎంత పెద్ద కష్టతరమైన సేవకైనా భయపడక అత్యంత ఉత్సాహముతో చేసేవాడో, అదేవిధంగా నేను కూడా శ్రీవేంకటేశ్వరుని నా స్వామిగా భావించి ఎల్లప్పుడు ఆయననే స్మరిస్తూ, ఆయన సేవలను అత్యంత ఉత్సాహంగా ఏమాత్రం వెరవక చేయమన్నాడు. నా నరనరాల్లో స్వామి నిక్షిప్తమైన తరువాత 2020 సంవత్సరం నుండి శ్రీ భరతుణ్ణి అనుసరించమన్నాడు. భరతునంతటి త్యాగ గుణంతో, శ్రీరాముణ్ణి అయోధ్యకు తిరిగి తెచ్చుటకు ఏవిధంగా ప్రతిరోజును లెక్కపెడుతూ, తపించుచు, జీవించాడో ఆ విధంగా నేను కూడా "నా" అన్నది నశింప చేసుకొని, ప్రతిరోజు శ్రీవేంకటేశ్వరుణ్ణి హరినామ క్షేత్రమునకు తెచ్చుటకు తపించుచు, జీవించుచు వేచి ఉండమని దిశా నిర్దేశం చేశాడు.

# స్వామివారు విధించిన ప్రవర్తనా నియమావళి

మా జీవితానికి ఈ క్రింది విధంగా ప్రవర్తనా నియమావళిని విధించారు.

మేము అత్యంత సాధారణ జీవితం గడపాలి. గొప్పవారమనే భావం కలిగే విధంగా ప్రవర్తించకూడదు. మా ఆచారాలు, అలవాట్లు, అత్యంత సాధారణంగా ఉండాలి. డైమండ్స్ మొదలైన వస్తువులను నేను కాని నా భార్య కాని ధరించకూడదు. వ్యర్థ ప్రసంగాలతో మిత్రులతో కాలక్షేపం చేయరాదు. సౌకర్యవంతమైన వస్తువుల పట్ల వ్యామోహం చెందరాదు. 'నా' అన్నది నశింపచేసుకోవాలి. ఉన్నంతలోనే తృప్తి చెంది సదా శ్రీవేంకటేశ్వరుని స్మరణలో కాలం గడపాలి. మేము నలుగురిలో ఉన్నప్పటికీ మానసికంగా భగవంతుణ్ణే చూచుచు జీవించుమన్నాడు. లోకంలోని విషయ వాసనలను త్రుంచి వేయమన్నాడు.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నన్ను ఒక సాధనము లాగా వాడుకుంటున్నాడు. నేను హరినామ క్షేత్రము ఏర్పాటు చేయుటకు, భగవంతుని పొందుటకు, కావలసిన స్థితికి చేరుటే ఆయన ఉద్దేశం లాగ కనబడ్డది. దీనిని నాకు అత్యంత అరుదైన అనుగ్రహాలతో పాటు అదే స్థాయిలో కష్టాలను కూడ కలుగజేశారు. ప్రతి లీలలో, కష్టము కాని సుఖము కాని కొంత కొంత మార్పును కలుగజేయువారు. ఒక ఇనుప ముక్కను అనుకున్న ఆకారానికి మార్చాలంటే ఎన్నోసార్లు కొలిమిలో వేడిచేసి సమ్మెటపోట్లు వేస్తే తప్ప అది ఆ ఆకారం లోనికి మారనట్లు నా జీవితంలో కూడా ఎన్నో అత్యంత కష్టమైన పరిస్థితులను కలుగజేశారు. ఈ విపత్కాల పరిస్థితులలో కూడా నేనున్నాను భయపడకుమని చెప్పేవారు. కాని పరిస్థితులు బలీయంగా ఉండటంచే స్వామివారి మాటపైన విశ్వాసము లేనట్లుగ తోచేది. విలవిల కొట్టుకున్నా వదిలేవాడు కాదు. తాను అనుకున్న మార్పు నా మూలం నుండి జరిగిందని భావించిన తరువాతనే సడలించేవారు. మొత్తం స్వామివారిపై నమ్మకం కలిగి, ఈ జీవితంలోని మరే విషయంపై మమకారమును సంపూర్ణంగా వదిలివేయుటకే నాలో పరివర్తన కోసమే ఇలాంటి పరిస్థితులను కల్పించి నాటకాలాడించేవారు. ఈ విధమైన మార్పుకోసం నాకత్యంత ఇష్టమైన వ్యాపారం, ఆస్తులు, ఆరోగ్యమును ఎంచుకొని అందులో ఇబ్బందులను కలుగజేసి నాలో లౌకిక విషయాల పట్ల వ్యామోహాన్ని తీసివేయునట్లు చేశాడు.



ఇప్పటివరకు నేను మరియు నా భార్య కలిసి కొన్నివేల అనుభూతులను పొందాము. మేము పొందిన మొత్తం అనుభూతులలో 90% అనుభూతులను నేను అనుభవించాను. నా భార్య 10% అనుభూతులను మాత్రమే అనుభవించింది. శ్రీవేంకటేశ్వరుడు నా భార్యను నన్ను అనుసరించునట్లు కట్టడి చేశాడు. నేను ఎంచుకున్న ప్రతి సేవలో అనుసరించుటే ఆమె కర్తవ్యం. కాని అప్పుడప్పుడు ఆమెలో ఉత్సాహాన్ని పెంచుటకు కొన్ని అనుభూతులను చూపేవాడు.

## స్వామివారి అనుభూతులు :

స్వామివారి అనుభూతులు ముఖ్యంగా 4 రకాలుగా ఉండును. **మొదటిది కలల రూపంలో :** ఇవి అంత స్పష్టంగా ఉండవు. వాటి గురించి, వాటి అర్థం కోసం తర్కించుకోవాలి. విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించి సరైన అర్థమును రాబట్టాలి. ఇది ఒక పరీక్ష లాంటిది.

**రెండవది హృదయాంతరంగం నుండి భావాలు :** కొన్నిసార్లు స్వామివారు నా హృదయాంతరంగం నుండి ఆ విషయానికి సంబంధించిన భావాలను వ్యక్తపరిచేవారు. ఇది అత్యంత స్పష్టంగా ఉండును. విచక్షణా జ్ఞానం అవసరం లేదు.

**మూడవది: అశరీరవాణి వాక్కులు :** ఇవి కొన్నిసార్లు స్వప్నాలు చూచునప్పుడు, ఆ స్వప్నాలలోనే ఈ అశరీరవాణి వాక్కులు వినబడేవి. మరికొన్ని ఉదయం నేను ప్రాణాయామం మొదలగునవి చేయు సమయాన వినబడేవి.

**నాల్గవది: ఈ అనుభూతి చాలా భిన్నం.** స్పృహలోనే ఉండేవారిమి కాని మా మనస్సు ఒక చిత్రాన్ని చూచుచుండును. మేము ప్రత్యక్షంగా ఆ చిత్రాన్ని చూచునట్లు అనుభూతి పొందేవారం. ఇది మాకు మాత్రమే కనబడేది. మా ప్రక్కనున్న వారికి కనిపించేది కాదు.

స్వామివారు ఒక్క విషయాన్ని ఒక్కసారి మాత్రమే చెప్పేవారు. దానిని గుర్తుపెట్టుకొని ఆచరించుట మా కర్తవ్యం. ఇంతవరకు మేము పొందిన దాదాపు అన్ని అనుభూతులు ఉదయం 4.30 నుండి 5.30 మధ్యన మాత్రమే వచ్చాయి.

## స్వామి సేవలు :

నా భాగ్యవశాత్తు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నన్ను తన పాదసేవకుడుగ స్వీకరించి ఈ జీవితములో నేను తృప్తి చెందే వరకు తనయొక్క మరియు తన భక్తుల యొక్క సేవాభాగ్యాన్ని ప్రసాదించాడు.

మేము కూడా స్వామి సేవను అత్యంత సమర్థవంతంగా ఏ లోటు లేకుండా, స్వామివారు మెచ్చేవిధంగా చేయాలనుకున్నాను. స్వామివారిని సంతోష పరచుటే మా కర్తవ్యంగా ఎంచుకున్నాము. మరియు ఈ క్రింది రెండు నియమాలను ఏర్పరచుకున్నాము.

(1) నా మనసులో కలిగే భావానుసారమే నేను నడుచుకోవాలి తప్ప ఇతరులను అడిగి పక్కదారి పట్టరాదు. ఇతరుల అభిప్రాయం ప్రకారం నేను చేయునది సరిగా లేదని భావించి బాధపడరాదు.

(2) ఏనాడు ఇతరుల డబ్బుకు డొనేషన్స్ రూపంలో ఆశపడరాదని, హృదయపూర్వకంగా ఇస్తే స్వీకరించాలి తప్ప ఎవ్వరినీ అడుగరాదని నియమము ఏర్పరచుకున్నాము. స్వామివారు మాకు ప్రసాదించిన డబ్బుతోనే పూర్తి సేవను చేయాలనుకున్నాము. ఈ రెండు నియమాలను మా మనస్సులో దృఢంగా నిలుపుకొని సేవను ప్రారంభించాము. స్వామివారిని ప్రతి క్షణము అడుగుచు, ఆయన సంతోషించినట్లు అనిపించితే అదే సరైన విధానమని అనుకొన్నాము. దీనికి స్వామివారు కూడా ఇదే సరైన మార్గం అని చెప్పుచు చక్కటి మార్గనిర్దేశము ఎప్పటికప్పుడు చేయుచు మమ్ము సన్మార్గములో, తాను ఆశించే మార్గములో తీసుకువెళ్ళేవారు.

ఎప్పుడైనా మా మనస్సు చలించి పై నియమాల నుండి ప్రక్కకు తప్పుచున్నప్పుడు, కొన్ని లీలలను చూపి, మమ్ము మళ్ళీ ఈ మార్గం లోనికి తెచ్చేవారు. ఈవిధంగా 2002 సంవత్సరం నుండి ఇప్పటి వరకు అంటే 2023 వరకు జరుగుచున్నది.

ఇప్పటివరకు శ్రీవేంకటేశ్వరుడు 6 రకాల సేవలను ఈ క్రింద పేర్కొన్న వాటిని ప్రసాదించాడు.

1. **2002 సంవత్సరంలో తిరుపతిలోని టిటిడి డైరీఫాంలో శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపమును నిర్మించి స్వామి వారి పాదపద్మములకు సమర్పించాము.**
2. **2002 సంవత్సరంలో "శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠము"ను స్థాపించి ప్రతి సంవత్సరం 70 వేల మంది భక్తులు వ్రాసిన 7 కోట్ల జప సమర్పణ.**
3. **2004 సంవత్సరంలో శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపము యొక్క బ్రాస్ రిప్లికాను 'నమోవేంకటేశాయ' అనే పేరుతో రథమును తయారు చేసి హైదరాబాద్ నుండి తిరుపతి వరకు ప్రతి సంవత్సరం 25 రోజులు రథయాత్ర చేయుట.**
4. **2007 సంవత్సరంలో 'శ్రీవేంకటేశం' అనే తెలుగు మాసపత్రికను ప్రారంభించుట.**
5. **2009 సంవత్సరం నుండి సంవత్సరానికి రెండుసార్లు 'భజగోవిందం' కార్యక్రమమును నిర్వహించుట.**
6. **2021 సంవత్సరం నుండి మొత్తం 111 ఉచిత శ్రీనివాస కళ్యాణాల సంకల్పం.**

పైన పేర్కొన్న ప్రతి సేవ నేటికీ కొనసాగుచున్నది. 'నమో వేంకటేశాయ' రథమును మాత్రము 2021 సంవత్సరము నుండి శ్రీనివాస కళ్యాణాలలో వాడుచున్నాము.

శ్రీవేంకటేశ్వరుడు సర్వశక్తిమంతుడు. నేను ఆయన సేవకుడిని అయినప్పటికీ ఏనాడు నన్ను బలవంతము చేయలేదు. ప్రతి సేవ మొదలు నేను చేస్తాను ప్రసాదించమని అత్యంత ఆర్తితో ప్రార్థించిన తరువాతనే ఆ సేవను ప్రసాదించేవారు. కాని దాని మూలము స్వామివారి నుండి లభించేది. ముందు ఆ సేవ ఒక మెఱుపులాగ నా హృదయములో ప్రత్యక్షమయ్యేది. తరువాత రోజుల్లో దీని గురించి మరిన్ని ఆలోచనలు కలిగి, చివరికి నేను దీనిని చేసి తీరాలనే పట్టుదల నాలో తారాస్థాయికి చేరి, స్వామివారిని ఈ సేవను ప్రసాదించమని రక రకాలుగా ప్రార్థించేవాడిని. మీరు నేను తృప్తి చెందేవరకు మీ సేవాభాగ్యాన్ని ప్రసాదించారు. ఇంతవరకు తృప్తి చెందలేదు. ఈ సేవను నాకు ప్రసాదించమని దీనాతి దీనంగా ప్రార్థించిన తరువాతనే ఆ సేవను ప్రసాదించేవాడు. ఈ సేవను నీవు కోరితేనే ప్రసాదించాను. కావున దీనిని సమర్థవంతంగా నిర్వహించే బాధ్యత నీదే అనేవాడు. కాని నాకు నిర్వహణలో ఇబ్బంది కలిగినప్పుడు పరిష్కారమార్గం చూపేవాడు. ఇలా నా మొదటి సేవ తేది 05-07-2002, తొలి ఏకాదశి రోజు, శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము నిర్మించాలనే కోరికతో ప్రారంభమైంది. తేది 15-10-2002 విజయదశమి రోజున శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం స్థాపించుటతో స్వామివారికి మరియు ఆయన భక్తులకు కలిపి సేవ చేయు భాగ్యము ఏర్పడింది.

## సేవను ఆటలాగ చిత్రీకరించుట :

మా జీవితంలో శ్రీవేంకటేశ్వరుని సేవ ఒక ఆటలాగా సాగింది. అత్యంత క్లుప్తంగా చెప్పాలంటే ఈ ఆట ఈ విధంగా ఉంది.

ఒక తండ్రి తన చిన్నబాబుకి తనంటే అమితమైన ప్రేమను రంగరించి పోశాడు. తండ్రిని వదలలేని స్థితికి తీసుకువచ్చాడు. ఒకరోజు ఆ బాబు తన తోటి బాలురతో, ఇష్టమైన ఆట వస్తువులతో ఉల్లాసంగా ఆడుకుంటున్న సమయాన, తండ్రి ఒక చాకొలెట్ వంటి మధుర పదార్థాన్ని చేతిలో పట్టుకొని, ఆ పిల్లవాడితో ఒక పందెం కాశాడు. తాను 16 మెట్ల పైన ఉన్నానని, తననే

చూస్తూ, ఎలాంటి తొణుకు బెణుకు లేకుండా ప్రతిమెట్టు జాగ్రత్తగా, క్రింద పడకుండా వచ్చి ఆ చాకొలెట్ ను తీసుకొని తనను చేరమని చెప్పాడు. నిబంధన ప్రకారం కేవలం ఒకే ఒక తప్పుకు అనుమతి, రెండవ తప్పు చేసినట్లయితే పిల్లవాడు ఓడిపోయినట్లు లెక్క. ఇది పందెం. దీనిని పిల్లవాడు సాధించాలి. ఈ తండ్రి చాల సమర్థుడు. 16 మెట్ల క్రింద ఉన్న ఆ బాబుకి నడకను, మెట్లు ఎక్కే విధానాన్ని కూడ పైన ఉండే నేర్పాడు. ఈ చిన్నపిల్లవాడు మాత్రం అత్యంత ఆనందంగా తన తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. తన తండ్రి మాత్రం పిల్లవాణ్ణి ఈ ఆటలను వదిలి, ఏమాత్రం తొట్రుపాటు లేకుండా, ఎప్పటికప్పుడు తాను చెప్పే ఆజ్ఞలను పాటించుచు, తన మిత్రుల, ఆటవస్తువుల సహవాసమును వదలి, తననే చూస్తూ మెట్లు ఎక్కి వచ్చి తనను చేరుకొమ్మన్నాడు. అయితే మొదటి మెట్టు ఎక్కే ప్రయత్నం లోనే ఈ పిల్లవాడు తొణికాడు. తరువాత ఆ తండ్రి సలహాల ఆధారంగా 15 మెట్లు ఎక్కగలిగాడు. కాని అప్పుడప్పుడు తన మిత్రులు ఆటవస్తువులతో చేయు చప్పుడుకు, మిత్రులపై నున్న ప్రేమకు తలొగ్గి, ఆ తండ్రికి తెలియకుండా ఓరకంట వారిని చూచుచు పైకెక్కాడు. ఈ తప్పును గమనించిన తండ్రి 16వ మెట్టు పైన కొంత చమురును పోశాడు. ఈ పిల్లవాడు 16వ మెట్టుపైన కాలు పెట్టగానే, ఆ చమురు ప్రభావముతో జారిపడ్డాడు. ఓడిపోయానని బోరున ఏడ్చాడు. దయామయుడైన ఆ తండ్రి తన పిల్లవాణ్ణి క్రింద పడకుండా పట్టుకొని నీవు గెలిచావు, ఏడవకుమన్నాడు. చాకొలెట్ ను తీసుకోమన్నాడు. కాని అభిమానం కల ఆ బాబు చాకొలెట్ తీసుకోకుండా తాను ఓడిపోవుటకు తండ్రే కారణం అని, తాను పట్టుకోకుండా ఉండి ఉంటే ఎలాగో నిలదొక్కుకుని పూర్తిగా ఎక్కేవాడినని మొరాయించాడు. కావాలంటే తనకు మరో అవకాశం ఇచ్చి చూడమన్నాడు. దయామయుడైన ఆ తండ్రి, ఎలాగూ తన పిల్లవాని గెలుపే ధ్యేయంగా ఉన్నాడు కాబట్టి, పిల్లవాని మాట ప్రకారం రెండవ అవకాశమును ఇచ్చాడు. ఈసారి తాను ఇంతకుముందు చేసిన ఎలాంటి పొరపాట్లు చేయకూడదని, ఓరచూపులు, మిత్రుల ఆకర్షణకు లొంగుట వంటివి చేయకూడదని, తననే తదేక దృష్టితో చూచుచు, విజయమే ధ్యేయంగా పెట్టుకొని పైకి ఎక్కి తనను చేరుకొమ్మని దిశానిర్దేశం చేశాడు. ఈ పిల్లవాడు కూడ ఇంతకుముందు చేసిన తప్పులు చేయకుండ సరిదిద్దుకుని, తండ్రిమాట ప్రకారం తండ్రినే చూస్తూ, ఇప్పటివరకు 5 మెట్లను ఎక్కి ప్రయాణించుచున్నాడు. త్వరలో 16 మెట్లు ఎక్కి తన తండ్రిని చేరుకొనుటకు ప్రయత్నించుచున్నాడు. ఈసారి తన మిత్రులకు, ఎలాంటి అల్లరి చేయక, తనను ఆకర్షించు ప్రయత్నం చేయక ఉండి ఉంటే తాను పొందబోవు చాకొలెట్ ను మొత్తం వారికే ఇచ్చుదునని చెప్పి వారి సహకారం కూడ తీసుకొనుటకు ప్రయత్నించుచు, పైకెక్కుచున్నాడు. ఇక్కడ తండ్రి – తిరుమల శ్రీవేంకటేశ్వరుడు, పిల్లవాడు – నేను. ఇక తోటిమిత్రులు – లోకవాసులు. ఆటవస్తువులు – విషయ వాసనలు అని గ్రహించినట్లైతే ఈ ఆట సరిగ్గా సరిపోతుంది.

## సేవలను ప్రసాదించుట :

2002 సంవత్సర మధ్యకాలంలో తిరుమల శ్రీవేంకటేశ్వరుని చూడాలని, ఆయన సేవ చేయాలని తపించిపోయాను. రకరకాలుగ వేడుకున్నాను. ఏవిధంగానైతే రామాయణమును కల్పించి అందులో శ్రీ ఆంజనేయుడు మొదలగు వారికి మీ సేవాభాగ్యమును ప్రసాదించారో అదేవిధంగా నాకోసం ఒక నూతన పనిని కల్పించి మీ సేవాభాగ్యాన్ని ప్రసాదించుమని ఒళ్ళు గగుర్పాటు చెందగ, కళ్ళనుండి నీళ్ళు ధారలై ప్రవహించుచుండగ దీనంగా వేడుకొన్నాను. అన్నట్లే స్వామివారు కరుణించి, ఏవిధంగా శ్రీఆంజనేయుడు శ్రీరాముణ్ణి తన స్వామిలాగ భావించి, సర్వదా ఆయన నామస్మరణతో జీవిస్తూ, ఎలాంటి సేవ చేశాడో, నీవు కూడ తిరుమల శ్రీవేంకటేశ్వరుని నీ స్వామిగ భావించి, ఆయనను సదా స్మరిస్తూ సేవ చేసుకోమన్నాడు. సేవలను ప్రసాదించుచున్నానన్నాడు. దీనితో నా జీవితము మారిపోయింది. అదే సమయంలో తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఒక అద్భుతమైన మరో లీలను ప్రసాదించాడు. దీనితో చాలా పరివర్తన చెందాను. రాజ మహారాజులు కూడ యోగ్యులు కానటువంటి అనుగ్రహాన్ని, అత్యంత అల్పుడినైన నాకు కలిగించినందులకు, అంతటి అనుగ్రహానికి పాత్రుణ్ణైనందులకు పరవశించిపోయాను. పర్యవసానంగా ఈ జీవితాంతం, సేవచేసి ఆ ఋణాన్ని తీర్చుకోవాలనుకున్నాను.



## శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం :


అనుకున్నట్లుగనే తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపావిశేషం చేత తేది 21-09-2002 న తిరుపతిలో టిటిడి వారి శ్రీవేంకటేశ్వర డైరీఫామ్ లో ''శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపము''ను నిర్మించి, స్వామివారి పాదపద్మములకు సమర్పించుట జరిగింది.

### శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం :

శ్రీవేంకటేశ్వరుని స్మరణ ఎంతో ఆనందాన్నిచ్చేది. పరవశించిపోయేవాడిని. మరియు నాకున్న జటిలమైన సమస్యలు కూడా స్వామివారి నామస్మరణ ప్రభావముచే తొలగిపోయాయి. ఇంతటి స్వామి కృపను నేనొక్కడినే అనుభవించక, స్వామివారి భక్తులు కూడా అనుభవించేటట్లు ఉపాయాన్ని చూపమని ప్రార్థించసాగాను. స్వామివారి సేవను జీవితాంతం చేసి ఆయన ఋణం తీర్చుకోవాలనుకున్నాను. చివరికి నేను ఒక అజ్ఞాత భక్తునిగ ఉంటూ, తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరము వారి భక్తులచే కనీసం 7 కోట్ల నామస్మరణ చేయించాలని తలంచాను. అందులకు శ్రీవేంకటేశ్వరునికి వారి భక్తులచే వ్రాయించిన జప సమర్పణ కార్యక్రమము సరైనదని ఎంచుకొని తేది 15-10-2002 విజయదశమి రోజు నిర్ణయించి, "శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం"ను స్థాపించాము. ఈ పీఠం పేరుపైన కార్యక్రమములు నిర్వహించుచు, నేను ఒక అజ్ఞాత వ్యక్తిగ ఉండాలన్నదే ధ్యేయం.

### స్వామివారితో పందెం కాయుట :

అయితే కాలము గడిచిన కొద్దీ నాలో ఉత్సాహం తగ్గకుండా ఉండుటకు, ఈ జప సమర్పణలో ఏమరుపాటు జరగకుండా ఉండుటకు ఒక సంకల్పం ఉంటే బాగుండునని ఆలోచించాను. వెంటనే శ్రీవేంకటేశ్వరుడు తనకు బొట్టు పెట్టే సంకల్పమును తీసుకొమ్మని సూచించాడు. ఇంజనీరింగ్ జ్ఞానముతో పరిశీలించి, తన బొట్టులో మూడు ఒకట్లు ఉన్నవని భావించి, మొత్తం 111 కోట్ల జపమును ప్రతి సంవత్సరం కనీసం 70 వేల మంది భక్తులు భాగస్వాములుగ కనీసం 7 కోట్ల చొప్పున 16 సంవత్సరముల వరకు సమర్పించాలని తలంచాను. వెంటనే నా మనస్సులో ఒక ఆశ చిగురించింది. వెనువెంటనే ఇలా అనుకున్నాను. ప్రభూ నేను మీకు బొట్టుపెట్టి వదలను. మిమ్ములను మా ఇంటికి ఆహ్వానించుదునన్నాను. మన హైందవ సాంప్రదాయం ప్రకారం ఒక వ్యక్తికి బొట్టు పెట్టి మన ఇంటికి ఆహ్వానించినట్లు నేను కూడ సేవచేసి, ఆ సేవను పూరించి, దాని ఫలముచే మీరు కోరినట్లుగ మీకు బొట్టుపెట్టి, మీ కృపను పొంది, మిమ్ములను మా ఇంటికి ఆహ్వానించుదునన్నాను. ఆ విధంగా మా ఇంటికి వచ్చిన తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి తనివితీర దర్శించి, ఆయనతో రెండు మాటలు మాట్లాడి, పాదపూజ చేసి తిరిగి తిరుమలకు పంపాలని భావించాను. స్వామివారు కూడ సరేనన్నారు. కాని ఈ సేవలో ఒక్క తప్పుకూడ ఉండకూడదనే నిబంధన విధించారు. కేవలం ఒకే ఒక తప్పుకు అనుమతించారు. అంటే ఈ నా మొత్తం సేవలో రెండు తప్పులు చేస్తే నేను ఓడిపోతాను. పర్యవసానంగా శ్రీవేంకటేశ్వరుని పొందే భాగ్యమును కోల్పోదునన్నమాట. ఈ విధంగా పందెం ఖరారైంది.



నిజానికి నేను స్వామివారికి నా తనివితీర సేవ చేయాలనే కోరికతో, ఆ సేవ మధ్యలో పలచబడకూడదనే విధంగా సంకల్పాన్ని కోరుకున్నానే తప్ప, శ్రీవేంకటేశ్వరుని పొందాలనే కోరిక నాకు లేదు. నేను కేవలం ఆయన ఋణాన్ని తీర్చుకొనుటకే సేవ చేయుచున్నాను కాని మరొకటి ఆశించి కాదు. కాబట్టి శ్రీవేంకటేశ్వరుని పొందాలనే ఈ రెండవ కోరిక నా మనస్సులో అస్సలు లేదు. పైగా నేను అత్యంత అల్పుణ్ణి, యోగ్యత లేనివాణ్ణి. ఇలాంటి ఆలోచన నా మనస్సుకు రాకూడదని, దీనిని ఎవ్వరైనా వింటే నవ్వుకుంటారని, నన్ను హేళన చేస్తారని సిగ్గు పడ్డాను. ఈ పందెం నాకు స్వామివారి కఠినమైన సేవను చేయుటకు ఉపయోగ పడుతుందని భావించాను. పైగా స్వామివారి ఈ మాటపై అంత విశ్వాసం కూడా పెట్టలేదు. కేవలం శ్రీవారికి నా శక్తిమేర సేవ చేయుటే నా ధర్మంగా భావించాను. ఒకవేళ స్వామివారు నా సేవకు సంతోషించి మా ఇంటికి వచ్చి ఆనందింప చేసినచో అది బోనస్ లాగ భావించుకున్నాను. శ్రీవేంకటేశ్వరుడు తృప్తి చెందితే మా ఇంటికి వస్తానన్నాడన్న విషయాన్ని 2021 సంవత్సరం వరకు నా భార్యకు కూడా చెప్పలేదు. నాకు, శ్రీవేంకటేశ్వరునికి మధ్యనే ఉన్నది.

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి మొత్తం 111 కోట్ల జపమును సమర్పించి, దాని ఫలితంగా స్వామివారికి బొట్టు పెట్టుటనే శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం యొక్క లోగో [లోగో] గ నిర్ణయించాను. దీనర్థం ఆనంద నిలయంలో ఉన్న శ్రీవేంకటేశ్వరునికి 111 కోట్ల జపం సమర్పించి, దాని ఫలితముతో స్వామికి బొట్టు పెట్టుట. ఇంతవరకు దీనర్థం నాకు, శ్రీవేంకటేశ్వరుడికి, మరి నలుగురైదుగురికి తప్ప ఇతరులకు తెలియదు. నేనే సిగ్గుతో తెలియనీయలేదు. అలాగని సంకల్పాన్ని వదలలేదు. తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సమర్పించే 111 కోట్ల సంకల్పమును ఒక సింబల్ [లోగో] గా మార్చి అసలు విషయము తెలియకుండా, లోగోను మాత్రమే భక్తులకు చూపెట్టేవారిమి.

## తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సం॥2002 నుండి సం॥ 2022 వరకు సమర్పించిన ప్రతి ఏడు కోట్ల జపసమర్పణ దృశ్య మాలికలు


1వ సారి 14-06-2003


2వ సారి 07-09-2004


3వ సారి 27-08-2005


4వ సారి 16-08-2006


5వ సారి 04-09-2007


6వ సారి 24-08-2008


7వ సారి 02-11-2009


8వ సారి 01-09-2010


9వ సారి 27-07-2011


10వ సారి 10-08-2012


11వ సారి 28-08-2013


12వ సారి 24-07-2014


13వ సారి 06-09-2015


14వ సారి 05-08-2016


15వ సారి 19-08-2017


16వ సారి 03-09-2018


17వ సారి 03-08-2019


18వ సారి 06-09-2020


19వ సారి 30-08-2021


20వ సారి 19-08-2022

## తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కోట్ల జప సమర్పణలోని సంకల్పము

ఈ సంకల్పాన్ని క్రింది విధముగా వ్రాసుకుని సేవను ప్రారంభించాము.

**సంకల్పము**

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కోట్ల జప సమర్పణ లోని సంకల్పము

1. శ్రీవేంకటేశ్వరుని నామమును అందరికీ తెలుపుతూ, నిర్మలమైన మనస్సుతో స్మరింప, ధ్యానింప చేయుటకు ప్రయత్నించుట, వారందరినీ శ్రీవారి కరుణా కటాక్షములకు, దివ్యమైన ఆశీస్సులకు, అనుగ్రహానికి పాత్రులుగా చేయుట.
2. భక్తులు తమ కోరికలను తీర్చుకొనుటకు ఒక సాధనముగా ఉపయోగపడుట. శ్రీవారి నామము స్మరించుట వలన కలిగే ఆనందమును అందరికీ తెలియజేసి కృతార్థులమైనట్లు భావించుట.
3. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తిని పెంపొందించి, ఆయనపై అమితమైన విశ్వాసము, సమర్పణ భావాన్ని కలిగించుటకు మరియు భక్తులకు శ్రీవారి సేవ చేయు భాగ్యమును కల్పించుట.
4. ప్రతిసారీ కనీసం 7 కోట్ల జపమును స్వామివారికి సమర్పించి



తిరుపతిలో స్వామివారికి సమర్పించబోయే 7 కోట్ల జప సమర్పణ

కనీసం 70 వేల మంది భక్తుల కోరికలను తీర్చమని శ్రీవేంకటేశ్వరుని ప్రార్థించే భాగ్యమును పొందుట.

5. 2002 నుండి 2018 వరకు, 16 సంవత్సరములు ప్రతి సంవత్సరం 7 కోట్ల జపమును శ్రీవేంకటేశ్వర స్వామికి సమర్పించుచు "శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము"ను శ్రీవారి నామముతో నింపి శ్రీవేంకటేశ్వరుడు మాపై పెట్టిన బాధ్యతను నెరవేర్చినామని సంతోషించుట.

6. శ్రీవేంకటేశ్వరుని నామము విలువ అనంతము. దానికి విలువ కట్టుట మాకు ఈ జన్మకు సాధ్యము కాదు. కాని దాని విలువను కోట్ల జపమునకు సరిపెట్టుమని ప్రార్థించి, అంత జపమును సమర్పించి, ఫలితమాశింపక శ్రీవారి తిరునామములో బిందువులాగా ఇమిడిపోయి ఆ తిలక ధారణలోని ఆనందమును అనుభవించుట.

7. ఈ కార్యక్రమములో అందరు భక్తులు పాలుపంచుకొనేలా ప్రోత్సహించి వారి శక్త్యానుసారం తమ సేవలందించుటకు అవకాశం కల్పించి, నిస్వార్థ సేవతో, ఫలితమాశించకుండా చివరిదాకా సేవ చేయుచూ చిట్టచివరకు ఆ శ్రీవేంకటేశ్వరుని పాదసేవకునిగా మిగిలి అమితానందమును అనుభవించుట.

శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠము ఆధ్వర్యములో స్వామివారి జప పుస్తకమును, ప్రతి పుస్తకములో 1250 స్వామివారి నామాలు పట్టేవిధంగా ప్రింట్ చేసి ఉచితముగా భక్తులకు పంచుటను తేది 15-11-2002 కార్తీక ఏకాదశి నుండి ప్రారంభించాము. మొత్తం 70,300 జప పుస్తకములను పంచి, ఇంగ్లీష్ క్యాలెండర్ ప్రకారం, సరిగ్గా 7 నెలల్లో ఏడుకొండల వాడికి 7 కోట్ల జప సమర్పణ తేది 14-06-2003 రోజున శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో అప్పటి ఈఓ శ్రీమాన్ అజయ్ కల్లామ్ గారి చేతుల మీదుగా జపహోమాదులు నిర్వహించి జపము వ్రాసిన వారి కోరికలను తీర్చమని స్వామివారిని ప్రార్థించి, స్వామివారికి తిరుపతిలో సమర్పించాము. ఈ సందర్భంలోనే శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారు నాకు "గోవింద దాసు"గ నామకరణం చేశారు. మరియు టిటిడి అధికారుల సూచన మేరకు ప్రతి గోకులాష్టమికి 7 కోట్ల జప సమర్పణను సమర్పించ కట్టడి చేయబడ్డది.

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా, 2003 సంవత్సరములో 1వ పర్యాయము ప్రారంభమైన 7 కోట్లజప సమర్పణ, 2018వ సంవత్సరములో 16వ పర్యాయముగా 7 కోట్ల జప సమర్పణ వరకు ఇదే విధంగా జరిగింది.


నాకు తెలియకుండానే శ్రీవేంకటేశ్వరుడు మా సేవను విస్తరించుట ప్రారంభించాడు.

## నమో వేంకటేశాయ రథం :

మొదటి జప సమర్పణలో మొత్తం 70,300 జప పుస్తకములను భక్తులకు పంచినప్పటికీ ఒకరు ఒకటి కంటె ఎక్కువ పుస్తకములు వ్రాయుట వలన, సమర్పించిన 7 కోట్ల జపములో 70,000 మంది భాగస్వాములు ఉండవలెననే నిబంధనలో లోపం ఏర్పడింది. నేను ఓడిపోయానని ఏడుస్తూ దీనంగా ప్రార్థించాను. వెంటనే ''శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము'' యొక్క నమూనాను ''నమో వేంకటేశాయ'' పేరుతో రథమును తయారు చేయమని సూచించాడు. మరియు దీనిని జప సమర్పణ కంటే 25 రోజుల ముందు నుండి హైదరాబాద్ నుండి తిరుపతి వరకు రథయాత్ర చేయమని సూచించాడు. అనుకున్నట్లుగనే 2004 సంవత్సరంలో మా రెండవ జప సమర్పణ సమయములో, 'నమో వేంకటేశాయ' రథమును తయారు చేసి, ప్రతి జప సమర్పణ కంటే 25 రోజుల ముందు, హైదరాబాద్ లోని మా నివాసం నుండి ప్రారంభమై వీధి వీధి తిరుగుచు, కోరిన భక్తుల ఇంటి వద్దకు వెళ్ళుచు, స్వామివారిని స్మరింప చేయుచు ప్రత్యేకంగా తయారుచేసిన సమర్పణ క్రతువుపై స్వామి మహామంత్రమును వ్రాయించి, దానిని శరణాగత పూర్వకంగా రథంలో వేయించుచు, తిరుపతి చేరుదుము. ఈ రథం స్వామివారి మహామంత్రమును పలుకుచు, తిరుమల శ్రీవారే మనవద్దకు వచ్చారన్న విధంగా ఉంటుంది. ఈ రథం ఒక లారీపై బిగింపబడి ఉంటుంది. ఇది పూర్తిగా బ్రాస్ తో తయారు చేయబడి అత్యంత ఆకర్షణీయంగా ఉంటుంది. రోడ్డుపై చూచిన వారు సైతం నమస్కరించాలనే కోరికను కలిగించేంత ఆకర్షణీయంగా ఉంటుంది. శ్రీవేంకటేశ్వరుడు వారి ఇంటికి వచ్చాడన్న తృప్తిని కలిగించుట, మరియు జప సమర్పణలో అధిక సంఖ్యలో భక్తులను భాగస్వాములను చేయుట దీని ముఖ్యోద్దేశం. 70 వేల మంది కంటే ఎక్కువ భక్తులు కనీసం ఒక్కసారైనా స్వామివారిని స్మరించి, ఆ సంవత్సరం సమర్పించబోవు 7 కోట్ల జపములో భాగస్వాములు అగుటను ఈ నమో వేంకటేశాయ రథం నూటికి నూరు పాళ్ళు పూరించింది. మా ఉద్దేశం, మా కారణంగా స్వామివారిని, 70 వేల మంది భక్తులచే కనీసం 7 కోట్ల సార్లు స్మరింపచేయుటయే తప్ప, జపం వ్రాయించుట కాదు. కాబట్టి ఈ రథం రోడ్డుపై తిరుగునప్పుడు కొన్నివేల మంది భక్తులు ఈ రథాన్ని అందులోని శ్రీవేంకటేశ్వరుణ్ణి చూచి నమస్కరించేవారు. మనస్సులో స్మరించేవారు. దీనితో మా సంకల్పం పూర్తైంది.

70 వేల జప పుస్తకములలో వ్రాయించిన జపముతో పాటు నమో వేంకటేశాయ రథం ద్వారా సేకరించిన క్రతువులను ప్రతి సంవత్సరం గోకులాష్టమి కంటె ఒకరోజు ముందు తిరుపతిలోని పాదాల మండపములో స్వామివారి పాదాలకు సమర్పించి, గోకులాష్టమి రోజు టిటిడి డైరీఫారంలో ఉన్న శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం వద్ద జనహోమాదులు నిర్వహించి, జపము వ్రాసినవారి కోరికలను తీర్చమని, వారికి శ్రీవారి కృపను ప్రసాదించమని ప్రార్థించి టిటిడి ఈవో గారి స్వహస్తాలతో స్థూపంలో సమర్పించుట జరుగుచున్నది.

మొదట్లో మొత్తం 16 సంవత్సరాలు అంటే 2002 సంవత్సరం నుండి 2018 సంవత్సరం వరకు మాత్రమే సంకల్పించిన ఈ జప సమర్పణ కార్యక్రమమును ఆ తరువాత జీవితాంతం పొడిగించాం. ప్రస్తుతం 21వ పర్యాయంగా 7 కోట్ల జపమును వ్రాయిస్తున్నాము. స్వామివారి కృపా విశేషం చేత ఈ కార్యక్రమానికి ప్రతి సంవత్సరం టిటిడి వారు అనుమతితో పాటు, కావలసిన ఏర్పాట్లను కూడా చేయుట ఆచారమైంది.



నమో వేంకటేశాయ రథం ముందు భాగం

## శ్రీవేంకటేశం మాసపత్రిక :

మాలో తపనను పెంచే విధంగా ఎప్పటికీ స్వామి సేవలో జీవితాన్ని గడిపే విధంగా, స్వామివారి యొక్క ఒక మాసపత్రికను ప్రారంభించమని ఆదేశించారు. నాకు తెలుగు రాదు. మాసపత్రికను ప్రారంభించలేను, నేను అర్హుణ్ణి కాను, నాకు తెలియదని ఎంత చెప్పినా వినక, ఇది స్వామివారి ఆజ్ఞగా భావించి చేయుమని కఠిన పదాలతో ఆజ్ఞాపించడం వలన 27-03-2007 తేది నుండి ఏప్రిల్ 2007 సంచికతో 'నమో వేంకటేశాయ' అనే తెలుగు మాసపత్రికను ప్రారంభించి జనవరి 2008 నుండి దీనిని 'శ్రీవేంకటేశం' అనే పేరుతో మార్పు చేసి ప్రచురించుచున్నాము.




ఈ పత్రిక ద్వారా శ్రీవేంకటేశ్వరుని యొక్క తత్త్వమును, ఆధ్యాత్మిక రచనలను, భక్తుల అనుభూతులను తెలుపుచున్నాము. ఏప్రిల్ 2007 నుండి నేటి వరకు 17 సంవత్సరములు పూర్తి చేసుకుని 18వ సంవత్సరం లోనికి అడుగిడింది.

## భజగోవిందం:

దీనిని కూడ శ్రీవేంకటేశ్వరుని ప్రేరణతో ప్రారంభించాము. భక్తులు తొలి ఏకాదశి మరియు వైకుంఠ ఏకాదశి పర్వదినాలలో హరినామ స్మరణ చేసి తరించాలన్నదే దీని ముఖ్యోద్దేశం. ఈ భజగోవిందం అనే కార్యక్రమం 2009 సంవత్సరం నుండి ప్రారంభించబడ్డది. ప్రతి సంవత్సరం తొలి ఏకాదశి మరియు వైకుంఠ ఏకాదశి రోజున మాత్రమే దీనిని నిర్వహించెదము. హైదరాబాద్ లోని వివిధ ప్రాంతాలలో దీనిని నిర్వహించుచున్నాము. ఈ కార్యక్రమంలో భజగోవిందం, హరినామ స్మరణ కీర్తనలు, ప్రవచనములు, అనుగ్రహ భాషణ మొదలగునవి ఉండును. భక్తులను భగవత్ కృపకు పాత్రులను చేయుటే దీని లక్ష్యం.

## సాధన చేయుమని సూచించుట :

శ్రీవేంకటేశం మాసపత్రికను ప్రారంభించిన తరువాత 2007 సంవత్సరం నుండి ఎక్కువ సాధన చేయుమనే విధంగా ఆదేశించుట మొదలుపెట్టాడు. నన్ను ఇంజనీరింగ్ కళాశాలలో మాస్టర్ డిగ్రీలో చేర్పించి, ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించమని చెప్పాడు.

2004 సంవత్సరం నుండి 2008 సంవత్సరం వరకు మాలో చాలా మార్పు కలిగించాడు. ఈ సేవను చేయుచు స్వామి వారి గురించి సాధన చేయుమనే విధంగా సూచించాడు. సంఘంలో అందరి మధ్యన జీవించుచున్నప్పటికీ ఎలాంటి విషయ వాసనలకు అలవాటు పడవద్దని చెప్పాడు. అన్య మతస్థుల మధ్య నివసించు హరిదాసు లాంటి జీవితమును గడపమన్నాడు. ఒకసారి "నీవు "నా" అన్నది వదిలించుకుంటే మంచి బహుమానం ఇస్తానన్నాడు. స్వామివారి బహుమానానికి ఆశపడి ఒక రెండు మూడు నెలలు 'నా' అన్నది వదులుటకు ప్రయత్నించి 'బహుమానం' అని అడిగాను. కాని ఇంకా నీకు యోగ్యత సిద్ధించలేదన్నాడు. ఇలా రెండు పర్యాయములు అయిన పిదప మూడవ పర్యాయంగా నేను 'నా' అన్నది వదిలించుకోలేదని తెలుపుటకు తిరుపతి నుండి "శ్రీశ్రీశ్రీ హయగ్రీవస్వామి" వారిని గురువుగా పంపి నాది నేను నా అంతరంగం తెలుసుకొనునట్లు చేశాడు. అంటే ఇంకా నేను 'నా' అన్నది వదలలేదని స్పష్టం చేశాడు. దీనిని సాధించుటకు సాధన చేయమన్నాడు. అప్పుడే అది సాధ్యమౌతుందని, బహుమానాన్ని పొందే యోగ్యుణ్ణి అవుతానని స్పష్టంగా చెప్పాడు.

## మా తల్లి ఋణం తీర్చుకొనుట :

14-10-2008 తేది రోజున మా అమ్మ స్పృహ తప్పి హాస్పిటల్ లో చేరింది. ఇదే ఆమెకు ఆఖరి రోజని తెలిసి చాలా విలపించాను. మనిషికి ఎన్నో జన్మలు లభించవచ్చు. కాని ప్రస్తుతము నాకు లభించిన ఈ జన్మ అత్యంత ఉత్తమమైంది. ఒకవేళ భగవంతుడు ప్రత్యక్షమై నీకు, భారతదేశ ప్రధాని, భారత రాష్ట్రపతి, భారతదేశ కుబేరుడు, ప్రపంచ కుబేరుడు లేక ప్రస్తుతమున్న పుల్లగూర్ల సాయిరెడ్డి జీవితాలలో ఏది కావాలని అడిగితే పుల్లగూర్ల సాయిరెడ్డి జీవితాన్నే కోరుకుంటాను. అంతటి ప్రధానమైంది నా ఈ జన్మ. ఎందుకంటే బహుశా నాకు తెలిసిన ఏ భక్తులూ స్వామివారి ఇంతటి అనుగ్రహానికి పాత్రులు కాలేదు. నా అదృష్టాన్ని ఒకసారి అర్జునునితో, ఒకసారి ద్రౌపదితో, కుంతితో, మరోసారి బలిచక్రవర్తితో పోల్చుకున్నానంటే స్వామి కల్పించిన అనుగ్రహము ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. అంతటి అనుగ్రహాన్ని పొందుటకు నాకు లభించిన ఈ జన్మయే కారణం. ఒకానొక సందర్భంలో శ్రీవేంకటేశ్వరుడు నా శరీరాన్ని స్పృశించాడు. పైగా ఇది కల కాదు నిజమే అంటూ నిదర్శనాలు కూడా చూపించాడు. నేను ఎంతటి అనుగ్రహానికి పరవశించి ఈ జీవితం మొత్తం ఆయనకు ఋణపడి ఉన్నానని భావించి, ఆ ఋణం తీర్చుకొనుటకు జీవితాంతం సేవ చేయ సంకల్పించుకున్నానో, అంతటి అనుగ్రహాలను నేను 14 పొందినట్లు శ్రీవేంకటేశ్వరుడు ఒకానొక సందర్భంలో చెప్పాడు. అంటే నేను కనీసం 14 జన్మలెత్తి, ఈ జన్మములో చేసినంత సేవ చేస్తే ఆయన ఋణాన్ని తీర్చుకోగలనన్న మాట. ఇంతటి అమూల్యమైన జన్మను ప్రసాదించిన నా తల్లి తండ్రులకు ఋణం తీర్చుకోవాలనే బలమైన

కోరిక నాలో కలిగింది. కాని నేను స్వామివారి భక్తుణ్ణి కాకపూర్వమే, 1990 సంవత్సరం లోనే మా తండ్రి చనిపోయాడు. కావున ఆయనకు ఋణం తీర్చుకునే అవకాశం రాలేదని బాధపడ్డాను. ఇప్పుడు 2008 సంవత్సరంలో నేను స్వామివారి భక్తుడనైన తరువాత, మా అమ్మ చనిపోవుచున్నది కావున ఈమెకు ఆమె జీవితానికి ఉపయోగపడే బహుమానాన్ని ఇవ్వాలనిపించింది. కాని అప్పటికే ఆమె స్పృహ కోల్పోయింది. ఏ బహుమానం ఇవ్వాలని ఆలోచించి, చివరికి ''ఈరోజు వరకు నేను సంపాదించిన మొత్తం పుణ్యములో 1/3 వంతు ఆమెకు ధారపోసి, శ్రీవేంకటేశ్వరుని ప్రార్థించి, ఈ పుణ్యముతో మా అమ్మకు వైకుంఠ ప్రాప్తిని కలిగించమని దీనంగా వేడుకున్నాను. 15-10-2008న మా అమ్మ చనిపోయింది. తరువాత రోజులలో నా కోరిక ప్రకారం మా అమ్మకు వైకుంఠాన్ని ప్రసాదించానని తెలిపి ఎంతో సంతోషపరచాడు. ఇలా మా అమ్మ ఋణం తీర్చుకున్నాను. కాని మా తండ్రి ఋణం ఇంకా తీర్చవలసి ఉంది.

## 'శ్రీవేంకటేశం ఆవిర్భావానికి శ్రీనివాసుని ఆదేశం' :

2009 సంవత్సరం నుండి నేను ప్రయాణించు దిశలో మార్పును కలుగజేశాడు. ఏప్రిల్ 2009 సంవత్సరం నుండి మేము ప్రచురించు ''శ్రీవేంకటేశం'' మాసపత్రికలో 'శ్రీవేంకటేశం ఆవిర్భావానికి శ్రీనివాసుని ఆదేశం' అనే శీర్షికతో మాసపత్రిక ప్రారంభించుటకు స్వామివారు చూపిన అనుభూతులను ధారావాహికంగా ప్రచురించాం. చివరికి ''అనుభూతుల ప్రచురణ ఇప్పుడే వద్దు'' అనే స్వామివారి ఆజ్ఞచే మార్చి 2010 నుండి మానేశాను.

## 'హరినామ క్షేత్రం' భావన మరియు మా తండ్రి ఆదేశం :

జులై 2009లో ప్రపంచంలో అందరికంటే పెద్దవాడు శ్రీవేంకటేశ్వరుడే. త్రివిక్రముడుగా అతనికి సమానమైనవారు మరొక్కరు లేరు అనే జ్ఞానమును కలుగజేశాడు. ఆయన పాదాలను అత్యంత భక్తి శ్రద్ధలతో, సంగీతం మేళవించిన పాటలతో సేవించినచో జీవితం ధన్యం కాగలదని దిశానిర్దేశం చేశాడు. 2009 సంవత్సరంలో కార్తీకమాసంలో తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించి స్వామివారి అఖండ హరినామ క్షేత్రమును స్థాపించాలనే కోరికను మొదటిసారి కలుగజేశాడు. కొంత కాలము దీనికై ఆలోచించిన తరువాత నా సామర్థ్యము సరిపోదని భావించి విరమించుకున్నాను. కాని శ్రీవేంకటేశ్వరుడు మరువలేదు. 2014 సంవత్సరంలో మళ్ళీ దీని గురించి తీవ్రంగా ఆలోచించే విధంగా చేశాడు. నేను పరీక్షలో పాస్ కావాలంటే 'హరినామ క్షేత్రము'ను నిర్మించి తీరాలని సూచించాడు. పైగా స్వర్గస్థులైన మా తండ్రి గారిని నా వద్దకు పంపి ''నీవు అనుకుంటున్నది చేయమని, దాని వలన నా స్వామివారు మరియు నేను తన కొడుకైనందున, తాను సంతోషించుదున'ని కూడా



శ్రీశ్రీశ్రీరామచంద్రరామానుజ జీయరు స్వామివారు 14-6-2003 మొదటి జప సమర్పణ సందర్భంగా గోవిందాసుగ దాస్య నామం ఇచ్చుట

చెప్పారు. కాని ఏ ప్రాంతములో దీనిని ఏర్పాటు చేయవలెనో చెప్పలేదు. తరువాత రోజులలో మా తండ్రి గారిని ఎన్నోసార్లు నా వద్దకు పంపి, నాకు యోగ్యత సిద్ధించుటకు మరియు నాలో 'నా' అన్నది లేకుండా చేయుటకు సహకరించునట్లు చేశాడు. ఈవిధంగా నేను మా తండ్రి ఋణం తీర్చుకోవాలంటే హరినామ క్షేత్రమును ఏర్పాటు చేసి తీరాలనే దిశా నిర్దేశం చేశాడు.

నిజానికి నేను కూడా ఈ హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయాలని చాలా రోజులనుండి ప్రయత్నించుచున్నాను. కాని నావల్ల కావటం లేదు. ఎంత ప్రయత్నించినా ఒక్క అడుగు కూడా ముందుకు జరుగుట లేదు. ఇంతకు ముందు ప్రసాదించిన 6 సేవలను సులభంగా, స్వామివారి సహకారంతో చేయగలిగాను. కాని దీనికి మాత్రం స్వామివారిని ఎంత ప్రార్థించినప్పటికీ లాభం లేకపోయింది. స్థలాన్ని కూడా సూచించలేదు. కాబట్టి దాదాపు విరమించుకున్నాను.

## స్వామివారికి బొట్టు పెట్టుట :

స్వామివారికి 16 సంవత్సరములలో మొత్తం 111 కోట్ల జప సమర్పణలో కాని, మరే సేవను కాని నేను కేవలం ఆయన ఋణం తీర్చుకొనుటకు చేశానే తప్ప మరోటి ఆశించి కాదు. శ్రీవేంకటేశ్వరుణ్ణి పొందాలనే ఆశ నాలో ఏ మూలన లేకుండెను. కాని 2016 సంవత్సరం నుండి స్వామివారిని పొందాలనే ఆశ చిగురించింది. 2018లో 16వ 7 కోట్ల జప సమర్పణ తరువాత ఈ కోరిక నెరవేరబోతోందని భావించాను. స్వామివారు మా ఇంటికి వస్తే, మా ఇంటిలో ఎక్కడ కూర్చోబెట్టాలని, ఇంటిని ఎలా అలంకరించాలని కూడా ఆలోచించాను. అన్నట్లుగనే 2018వ సంవత్సరంలో 16వ జప సమర్పణ కావించిన పిదప, ఈ మొత్తం 111 కోట్ల జపసమర్పణ పుణ్యంతో స్వామివారికి బొట్టుపెట్టి ఇంటికి ఆహ్వానించాను. కాని ఆ రోజు రాత్రి ''నీవు పరీక్ష పాస్ కాలేద''ని సూచించాడు. ఎందుకో నాకు అర్థం కాలేదు. తెలిసి నేను ఎలాంటి పొరపాటు చేయలేదు. స్వామివారు చాలా పెద్దవారు. ఆయనకు ఎన్నో పనులుంటాయి. వీలు చూచుకొని వస్తాడనుకొన్నాను. అయినా నా సంకల్పం, సేవ చేయుటయే కావున, 2018 సంవత్సరంలో ఈ జప సమర్పణ కార్యక్రమమును ఆపివేయకుండా, జీవితాంతం కొనసాగించ

నిర్ణయించుకున్నాము. ఇక రథయాత్రను మాత్రం 2020 వరకు అంటే నా వయస్సు 60 సంవత్సరములు నిండేవారకు చేయ నిర్ణయించుకొని కొనసాగించుచున్నాము. కాని శ్రీవేంకటేశ్వరుడు ఎప్పుడో ఒకప్పుడు తప్పక మా ఇంటికి వచ్చుదురనే నమ్మకం నాలో బలంగా ఉండేది. ఇక 2020 వ సంవత్సరంలో 18వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ సమయాన కోవిడ్-19 కారణంగా నమోవేంకటేశాయ రథయాత్ర చేయకనే 7 కోట్ల జప సమర్పణ చేశాము. జపమును తిరుపతికి పంపి టిటిడి అధికారులచే జపసమర్పణ కావింపచేశాము. మేము మాత్రం తిరుపతి వెళ్ళక మా ఇంటిలో రథం షెడ్డు ముందు యజ్ఞం చేసి స్వామివారిని ప్రార్థించాము.

## శ్రీనివాస కళ్యాణాల ఏర్పాటు:

ప్రతి తొలి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి రోజులలో హైదరాబాద్ లో భజగోవిందం ఏర్పాటు చేసేవారిమి. కాని కోవిడ్-19 పరిస్థితుల వలన తేది 01-07-20, తొలి ఏకాదశి, నా 60వ పుట్టినరోజు 'భజ గోవిందం'ను నిర్వహించలేక దిగులు చెందాను. చివరికి 8 మంది సమక్షంలో మా ఇంటిలో శ్రీనివాస కళ్యాణాన్ని నిర్వహించాము. అంత పెద్ద స్వామి కళ్యాణాన్ని ఏకాంతంగా నిర్వహించుటను చాలా చిన్నతనంగా భావించి బాధ పడ్డాను. నా స్వామికి అవమానంగా భావించాను. ప్రతీకారేచ్ఛతో రగిలిపోయాను. చివరికి కొన్నివేల మంది సమక్షంలో, వందల కళ్యాణాలను, వివిధ ప్రాంతాలలో, భక్తులు భాగస్వాములుగా ఉంటూ నిర్వహించగలనని, ఈ సేవను ప్రసాదించమని దీనాతి దీనంగా వేడుకున్నాను. తేది 19-07-2020న శ్రీనివాస కళ్యాణాల విధి విధానాలను కూడా నిర్ణయించుకున్నాను. దాని ప్రకారం మొత్తం 111 ఉచిత శ్రీనివాస కళ్యాణాలను శాస్త్రోక్తంగా, వివిధ ప్రాంతాలలో, కనీసం సంవత్సరానికి 7 కళ్యాణాలకు తగ్గకుండా నిర్వహించాలి. ఈ కళ్యాణాలు జప సమర్పణ మాదిరి కాకుండా, ఒక సంవత్సరంలో ఎన్ని చేస్తే అవన్నీ లెక్కలోనికి వచ్చునని ముందే నిర్ణయించుకున్నాము. ఇది సంకల్పం. స్వామివారు ఈ సంకల్పాన్ని అనుగ్రహించారు. పైగా నాకు సంబంధించిన, నాతో కాని, నా సేవతో సంబంధమున్న అందరికీ స్వామి అనుగ్రహము లభించేటట్లు చేయమన్నారు. నేను జన్మించిన మా అమ్మమ్మ గ్రామము అప్పనపల్లిలో, మా సొంత గ్రామము చిన్నగుండవెల్లిలో తప్పక నిర్వహించమని సెలవిచ్చారు. పైగా ఈ కళ్యాణాల కార్యక్రమమునకు 'శ్రీ ఆండాళ్' రూపంలో 'పద్మావతి' అమ్మవారి అనుమతి కూడా లభించింది. ఈ కార్యక్రమానికి నాకంటే ఎక్కువ ఆత్రుత స్వామివారికి ఉన్నట్లు తెలియజేశాడు. కాని కోవిడ్-19 నిబంధనల వలన, ప్రభుత్వం వారు ఆధ్యాత్మిక సమావేశాలను అనుమతించనందున కొంత విరామం దొరికింది. సంధి కాలం, లక్ష్యానికి శిక్షణ ఇచ్చుట ప్రారంభించాడు.

## అనుభూతులను చదవమని కోరుట:

అసలు కథ ఇప్పుడే మొదలైంది. గత 20 సంవత్సరాల నుండి స్వామివారి దివ్యమైన అనుభూతులను ఎన్నో పొందాను. అన్నింటిని ఒక 6 పుస్తకములలో వ్రాసి భద్రపరిచాను. వాటిని మొత్తం ఒకేసారి ఎప్పుడూ చదవలేదు. మాసపత్రికకు సంబంధించిన అనుభూతులను ప్రచురించినప్పుడు దానికి సంబంధించిన, అప్పటివరకు పొందినవి మాత్రమే చదివాను. తేది 25-11-2020 ప్రాంతమున శ్రీవేంకటేశ్వరుడు, నీ మొత్తం అనుభూతులను వెంటనే చదువమని ఆజ్ఞాపించాడు. అప్పుడు నా అనుభూతులు వ్రాసిన పుస్తకములను వెతకగా మొత్తం 6 పుస్తకములలో, బుక్ నెం.1,2 జిరాక్స్ కాపీలు, బుక్ నెం. 5,6 ఒరిజినల్స్ మాత్రమే దొరికాయి. బుక్ నెం. 3 లో కొంత భాగము, మరియు బుక్ నెం. 4 పోయాయి. 18-08-2009 తేది నుండి 24-02-2011 తేది వరకు పొందిన అనుభూతులు లభించలేదు. లభించిన వాటిని చదివి అర్థం చేసుకొనుటకు నాకు రెండున్నర నెలలు పట్టింది. స్వామివారి లీలలలోని రహస్యం కొంతవరకు అర్థం అయినది. నిజానికి శ్రీవేంకటేశ్వరుడు నన్ను ఒక పనిముట్టులాగ ఎంచుకొని, తన హరినామ క్షేత్రం ఏర్పాటు చేయుటకు ప్రయత్నించుచున్నాడని అర్థం చేసుకున్నాను. మరియు ఎంతవరకైతే నేను హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయనో, అంతవరకు పరీక్షలో పాస్ కాను అని కూడ తెలుసుకున్నాను.

శ్రీవేంకటేశ్వరుడు మా ఇంటికి వస్తానన్న విషయం వట్టిమాట కాదని, నిజానికి స్వామివారు మా ఇంటికి రావటానికి, నన్ను యోగ్యుణ్ణి చేయుట కొరకు ఇంత కష్టపడుచున్నారని, నేను మాత్రం దీనిని సరిగా పట్టించుకోక, సరైన విధంగా అర్థం చేసుకోక చాలా పెద్ద తప్పు చేశానని కుమిలిపోయాను. స్వామివారి లీలల యందు సంపూర్ణ విశ్వాసమును కలిగి ఆ దిశగా పయనించనందులకు చాలా చింతించాను. అత్యంత సాధారణ, అధమ స్థాయి వ్యక్తినైన నన్ను ఎన్నుకొని, నాపై నమ్మకంతో, ఒక పనిని అప్పగించితే దానిని సరిగ నిర్వహించలేక ఆయన ముందు తల దించుకుని ఏడుస్తూ క్షమించమని నిలబడ్డాను. నేను ఒక అయోగ్యుడనైన సేవకుడనంటూ, మీలాంటి పెద్దలకు నాలాంటి సేవకుడు ఉండుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు దెబ్బతింటాయని భావించి విలపించసాగాను. ఒక దశలో వారి సుదర్శన చక్రాన్ని ప్రార్థించి నేను మీ స్వామికి అపకారము చేశాను, నన్ను సంహరించమని వేడుకున్నాను.

## పందెంలో ఓడిపోవుట :

ఒక్క మాటలో చెప్పాలంటే తేది 16-12-2020న నేను పందెంలో ఓడిపోయానని తెలుసుకున్నాను. గత 18 సంవత్సరాల నుండి అంటే 2002 సంవత్సరం నుండి 2020 వరకు ఒక్కరోజు విరామము లేకుండా, రాత్రింబవళ్ళు స్వామివారి సేవపైననే దృష్టి

నిలిపి, ఒక్క తప్పు చేయకూడదని భావించి ఎంతో కఠోరంగా స్వామి సేవ చేసినప్పటికీ పందెంలో ఓడిపోయాను. ఫలితంగా తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి పొందే భాగ్యాన్ని పోగొట్టుకున్నాను. కఠోర సాధన చేశాను. 2007 సంవత్సరం లోనే నన్ను దగ్గరనుండి గమనించిన శ్రీమాన్ డా॥ రమణాచారి గారు నా సేవా ఆత్రుతను, తపనను చూచి నేను శ్రీవేంకటేశ్వరుని దివ్యదర్శనమును పొందాననే అనుమానమును వెలిబుచ్చాడు. ఈ కలియుగములో కేవలం మీ నామస్మరణ చేయుచు, మీ పాదాలను దర్శించే అత్యంత సాధారణ మానవునికి కూడ తమ దివ్య దర్శన భాగ్యము కలుగుతుందనే దానికి నిదర్శనముగా నన్ను ఎన్నుకోవాలనే కోరికకు అనుగుణంగా సాధన చేశాను. సేవ చేసి స్వామివారి మెప్పు పొంది, బోనస్ కు యోగ్యుణ్ణి అవుతాననే నమ్మకము నాలో ఎంతో ఉండెను. 2002 సంవత్సరం నుండి, సంఘం నుండి వెలివేయబడ్డ వ్యక్తి లాగ, ఎవరితో కలవక ఏకాంతంగా స్వామిని స్మరిస్తూ జీవితం గడుపుచున్నాను. అయినప్పటికీ శ్రీవేంకటేశ్వరుడు ఆశించిన స్థాయికి చేరుకోలేకపోయాను. నిజానికి నాకు స్వామివారిని పొందలేకపోయాననే బాధ కంటే నేను ఒక అయోగ్యుడనైన సేవకుడననే బాధ నన్ను కలచివేసింది. నా వలన నా స్వామికి అపకీర్తి తెచ్చుటను సహించలేకపోయాను. ఈ అసమర్థ సేవకుడిని సంహరించమని లేక తరుణోపాయం సూచించమని దీనాతి దీనంగా వేడుకున్నాను. అపరాధ భావము నా ఒళ్ళంతా నిండుకున్నది. ప్రతి క్షణము క్రుంగిపోవుచున్నాను. నిజానికి నేను ఏ తప్పూ చేయలేదు. విధి వక్రీకరించి ఓడిపోయానే తప్ప, తప్పు చేసి ఓడిపోలేదు. అది ఈవిధంగా జరిగింది.

మా తల్లి 2008 సంవత్సరములో చనిపోవునప్పుడు, ఆమెకు వైకుంఠ ప్రాప్తి నిమిత్తమని అప్పటివరకు, అంటే అక్టోబర్-2008 వరకు నేను ఆర్జించిన పుణ్యంలో మూడవ వంతు ఆమెకు సమర్పించాను. 2008 సంవత్సరం వరకు 6 పర్యాయాలు జపసమర్పణ జరిగింది. అందులో నుండి మూడవ వంతు, అంటే 2 సంవత్సరముల ఫలమును మా అమ్మకు సమర్పించాను. కావున నేను స్వామివారికి సంకల్పించిన 111 కోట్ల జపము, 16 సంవత్సరాలు కావాలంటే 2018 సంవత్సరానికి బదులు 2020 సంవత్సరానికి మార్చబడిందన్నమాట. 2020 సంవత్సరంలోని 7 కోట్ల జప సమర్పణ నా సంకల్పాన్ని పూరించుతుంది. కాని ఆ సంవత్సరం కోవిడ్-19 కారణంగా రథయాత్ర చేయకనే 7 కోట్ల జప సమర్పణ జరిగింది. అంటే, 70 వేల మంది భక్తులు భాగస్వాములుగ లేకుండగనే 7 కోట్లు సమర్పించాము. ఫలితంగా రెండవ తప్పు జరిగి ఓడిపోయాను. ఈ విధంగా విధి వక్రీకరించుటచే, నేను తప్పు చేసిన వాడిలా ఓడిపోయాను.

## 'శ్రీ భరతుణ్ణి' అనుసరించమని సూచించుట :

అసలు ఈ తప్పు ఎలా జరిగింది? విధి ఏ విధంగా వక్రీకరించింది? విధి శ్రీవేంకటేశ్వరుని చేతిలో ఒక పనిముట్టు మాత్రమే. అలాంటిది



హైదరాబాద్ లో నమోవేంకటేశాయ రథమును ప్రారంబించుచున్న
శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామి వారు

శ్రీవారి ఆజ్ఞ లేకుండా ఇది జరగదనిపించింది. శ్రీవేంకటేశ్వరుడే కావాలని చేశాడనిపించింది. ఈ ఆలోచన నాలో రాగానే "నీవు భరతుణ్ణి అనుసరించ"మంటూ పదే పదే భావాలు రాసాగాయి. మరియు నా దుఃఖాన్ని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు ఈ రాత్రి అంటే తేది 22-12-2020 న కలలో మా కుటుంబము నిర్వహించిన శ్రీవారి కళ్యాణము లాంటి ఉత్సవానికి వచ్చిన భక్తులందరూ తిరుపతి లడ్డూలను బహుమానంగా ఇచ్చారు. దీని అర్థాన్ని కేవలం శుభసూచకంగా భావించి, అర్థం చేసుకునే అర్హత సాధించనందున, సరిగా అర్థం చేసుకోక అలాగే దుఃఖించుచున్నాను. స్వామివారికి నాపై కోపమున్నదని భావించి, ప్రత్యేక పూజలు చేయుట ప్రారంభించాను. మరియు మీరు నన్ను ఎం.టెక్ మాత్రమే చదువమన్నారు. నేను పిహెచ్.డి కూడా చేయుటకు సిద్ధం ప్రభూ! అంటూ తెలియచేస్తూ తీవ్రమైన సాధన చేయసాగాను. అప్పటికే మానసికంగా చాలా మార్పు చెందిన నేను, స్వామివారి మరో లీల ద్వారా పుత్రులపైన, కుటుంబం పైనున్న వ్యామోహాన్ని సమూలంగా త్రుంచివేశాడు. నాకు అపుడు శ్రీవేంకటేశ్వరుడు మాత్రమే అని బలంగా భావించి, ఆయన సేవలకు మరింత డబ్బును అత్యంత ఆనందంగా ఖర్చు చేయాలనే భావం బలపడింది.

## భాగవతుల ఆశీర్వాదముచే విజయము సాధించుట:

చివరికి నా దుఃఖాన్ని సహించలేక తేది 13-02-2021 రోజున తిరుపతి లడ్డూలను బహుమానంగా పొందుట లోని సరైన అర్థమును ఈ విధంగా చెప్పారు. "నీవు భాగవతుల ఆశీర్వాద ఫలముచే విజయము సాధించావు" దుఃఖించకుమని సెలవిచ్చారు. అంటే నా సేవ ద్వారా 2002 సంవత్సరం నుండి నేటివరకు ఎందరికో నా వలన భగవంతుని కృప లభించింది. ఆ భాగవతుల ఆశీర్వాద ఫలితముగా నీవు గెలిచావు అని నన్ను ఊరడించాడు. అంటే భాగవతుల ఆశీర్వాదమనే గ్రేస్ మార్కులతో పాస్ అయ్యావని సూచించాడు. వెంటనే ఈ విజయమును భాగవతులకు అంకితము చేశాను. ఎందుకో నేను ఈ విజయాన్ని జీర్ణించుకోలేకపోయాను. నాకు కేటాయించిన స్వామివారి సేవలో ఇతరుల జోక్యాన్ని జీర్ణించుకోలేదు. భాగవతులంటే నాకెంతో ఇష్టం, గౌరవం. కాని ఈ

విషయంలో మాత్రం జీర్ణించుకోలేకపోయాను. వెంటనే స్వామివారిని ఇలా ప్రార్థించాను. ప్రభూ శ్రీవేంకటేశ్వరా! నేను ఈ విజయమును కోరుకోవడం లేదు. దయచేసి ఈ విజయమును భాగవతులకు పంచిపెట్టి నాకు మరో అవకాశమును ప్రసాదించమని వేడుకున్నాను.

## శ్రీనివాస కళ్యాణాలను మరో అవకాశంగా ప్రసాదించుట :

స్వామివారు దీనికి ఒప్పుకొని మరో అవకాశంగా 'శ్రీనివాస కళ్యాణాలను' ప్రసాదించారు. నేను మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలను అత్యంత సమర్థవంతంగా, ఒక్క తప్పు లేకుండా నిర్వహించి, తిరుమల శ్రీవేంకటేశ్వరునికి బొట్టు పెట్టి మా ఇంటికి ఆహ్వానించాలి. ఈ రెండవ పర్యాయపు సేవలో శ్రీ 'భరతుణ్ణి' అనుసరించమన్నారు. నిజానికి రామాయణంలో శ్రీ భరతుడిది విశిష్టమైన పాత్ర. తప్పు చేయకున్నా శిక్ష అనుభవించాడు. నేను ఏ తప్పూ చేయలేదని శ్రీరాముణ్ణి వేడుకున్నప్పటికీ విధి అనుసారం శిక్షను అనుభవించమన్నాడు. చివరికి భరతులవారు శ్రీరాముని ఆజ్ఞానుసారం శిక్ష అనుభవించాడు. ఫలితంగా రామాయణం ఏర్పడింది. శ్రీరాముని కృప, ఆదర్శం తరతరాల లోకవాసులకు కలిగింది. భరతుడు అత్యంత త్యాగ గుణంతో రాజ్యపాలన చేయుచు, శ్రీరాముని రాకకై తపించిపోయాడు. శ్రీరాముడు అయోధ్యకు రావటానికి ఒక్కరోజు ఆలస్యమైనా భరించలేని తపనను పొందాడు. నన్ను ఇదేవిధంగా ఈ కళ్యాణాల సంకల్పమును నెరవేర్చుచు, శ్రీవేంకటేశ్వరుని కొరకు వేచి చూడమన్నారని భావించాను. చివరికి ఈ విధంగా నేను రెండవ సంకల్పాన్ని స్వీకరించాను. మరియు ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మొదటి ప్రయత్నం ట్రయల్ రన్ లాంటిదని, ఇప్పుడే నిజమైన పందెం అని భావించుకున్నాను.

## పట్టుదల పెరుగుట:

గతంలో శ్రీవేంకటేశ్వరుడు నేను కోరకముందే రకరకాలుగా అనుగ్రహించి, 6 సేవలను ఏర్పాటు చేయుటకు కారకుడైనాడు. కాని ఈ 7వ సేవగా హరినామ క్షేత్రం ఏర్పాటుకు అవసరమైన శ్రీవారి దివ్యదర్శనమును పొందే విషయములో మాత్రం, నన్ను యోగ్యతను పెంచుకోమని మరీ మరీ సూచించుచున్నాడు. గతంలో అడ్డురాని యోగ్యత స్వామిని పొందుటలో అడ్డు వచ్చుచున్నది. బహుశా ఇది ఆయన ఏర్పాటు చేసిన విధి విధానం. దీనిని ఎవ్వరూ అతిక్రమించుటకు వీలులేదు. మనకు నేరుగా ఉడికిన అన్నాన్ని ప్రసాదించక, పైరు వేసి, కోసి, బియ్యం తీసి, ఉడికించిన తరువాతనే అన్నం ఏర్పడినట్లు, స్వామిని పొందాలంటే తగిన సాధన చేసి యోగ్యతను మానవుడు సాధించాలనే విధి నిర్ణయం ప్రకారం స్వామివారు ఈ పద్ధతిని అనుసరించుచున్నారు అనిపించింది. నాకు ప్రసాదించిన 6 సేవల ఫలితమును స్వామికి సమర్పించి, దానితో పాటు కావలసిన సాధనను చేసి, యోగ్యతను సాధించి, స్వామి మెప్పు పొంది మాత్రమే దీనిని సాధించగలము అని భావించాము.

ఈసారి నాలో పట్టుదల ఎంతో పెరిగింది. ఎలాగైనా యోగ్యతను సాధించాలని భావించి గతంలో చేసిన తప్పులను చేయకుండా చూచుకున్నాను. ఇంతకుముందు వ్యాపారం మానేసినప్పటికీ, అప్పుడప్పుడు సేద తీర్చుకొనుటకు ప్లాట్లు కొని అమ్మేవాడిని. మరియు నలుగురితో కలిసి సరదా మాటలు మాట్లాడేవాణ్ణి. ఎప్పటికీ స్వామిని స్మరించక సేద తీర్చుకొనుటకు అప్పుడప్పుడు గ్యాప్ ఇచ్చేవాణ్ణి. ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూచుకున్నాను. మరియు సంకల్పాన్ని సాధించుటకు విశ్వప్రయత్నం చేయుటను ప్రారంభించాను. స్వామివారే స్వయంగా నా ప్రయత్నాలను మెచ్చుకుంటూ ప్రోత్సహించిన సందర్భాలు ఎన్నో ఉన్నవి. నేను సాధించగలననే విశ్వాసాన్ని నాలో కలుగజేశాడు. ఒకసారి "నేను చెప్పినట్లు 'నా' అన్నది నశింపచేసుకుని ఉండి ఉంటే ఎప్పుడో సాధించేవాడివి, కాని దూరపు మార్గాన్ని ఎన్నుకొని కష్టపడుచున్నావు" అయినప్పటికీ సాధించగలవని అన్నారు.

ఇప్పుడు నేను హరినామ క్షేత్రమును ఎక్కడ ఏర్పాటు చేయాలని ఆలోచించుచున్నాను. తెలిసిన వారినందరినీ తగిన ప్రాంతము సూచించమని వేడుకొంటున్నాను. మా ఇంటికి దగ్గరి ప్రాంతములు చూచాను. ఒకసారి మా వూరు చిన్నగుండవెల్లి లోని మా ఇల్లును హరినామ క్షేత్రంగా మార్చి అక్కడ పెట్టాలనుకున్నాను. డా॥ రమణాచారి గారు కొండపాకలో ఉన్నవారి ఆశ్రమములో పెట్టుకొమ్మని సూచించారు. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం తాను సూచించిన ప్రాంతంలోనే నెలకొల్పమని స్పష్టంగా చెప్పారు. చివరికి ఈ క్షేత్రం ఎక్కడ ప్రారంభించాలనే విషయం మీరే చెప్పమని, మీ సహాయం లేకుండా నాకు సాధ్యం కాదని చెప్పాను. ఈ హరినామ స్మరణ చేయు భక్తులను ఆకర్షించుట, వారి కోరికలను నెరవేర్చుట, తృప్తి పరచుట మొదలగునవి మీరు చేస్తేనే ఇది సాధ్యం. ఈ సహాయం చేయమని వేడుకున్నాను. మరియు మా తండ్రి సహాయాన్ని కూడా సమకూర్చమని వేడుకున్నాను. స్వామి వారు సరే అన్నట్లు సంకేతం పొందాను.



శ్రీశ్రీశ్రీ పుష్పగిరి స్వామివారిచే ప్రారంభమైన 111 కళ్యాణాల కార్యక్రమం

## కళ్యాణాల కార్యక్రమం ప్రారంభం :

చివరికి 20-07-2021 తేదీ తొలి ఏకాదశి రోజున శ్రీశ్రీశ్రీ పుష్పగిరి స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణ, మరియు మంగళాశాసనములతో తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సంకల్పించిన మొత్తం 111 కళ్యాణాలలో మొదటి కళ్యాణం హిమాయత్ నగర్ టిటిడి హాలులో జరిగింది. ఆ తరువాత కళ్యాణాలు జరుగుచున్నవి. ప్రతి కళ్యాణం స్వామిని చేరుటకు ఒక మెట్టుగా భావించి, అత్యంత ఆత్రుతతో, ఏ తప్పు జరగకుండా చేయుచున్నాము. ప్రతి శ్రీనివాస కళ్యాణం, ఒక మాస్ కళ్యాణం లాగా, వీలైనంత ఎక్కువమంది భక్తులు చూచేవిధంగా ఏర్పాట్లు చేయుచు, నిర్వహించుచున్నాము.

## ఫలితాన్ని భాగవతులకు పంచుట :

స్వామివారు భాగవతుల ఆశీర్వాద ఫలితంగా గెలిచావని చెప్పినప్పుడు వారే దీనికి అర్హులు అని భావించి, ఆ ఫలితాన్ని వారికి పంచమన్నాను.కానినామనసులో ఈమొత్తాన్ని ముద్రించుకోలేదు. స్వామివారిపై ఆశ చావలేదు. కాబట్టి మళ్ళీ ఒకసారి బయటికి వచ్చి నన్ను బాధించాయి. మళ్ళీ కుమిలిపోయాను. నా ముఖమును చూపుటకు కాని, గుడిలోనికి వెళ్ళి స్వామిని దర్శించుకొనుటకు కాని యోగ్యత లేనివానిగ భావించి దుఃఖించుచున్నాను. దీనిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు 'నీవు విజయం సాధించావు' అని తెలిసినప్పటినుండి అన్ని అనుభూతులను వెంటనే చదువమని మళ్ళీ ఆజ్ఞాపించాడు. వాటిని తిరిగి చదివిన తరువాత పశ్చాత్తాపముతో స్వామిని క్షమించమని వేడుకున్నాను. మళ్ళీ అడగనని, ఫలితాన్ని భాగవతులకు పంచమని దీనంగా వేడుకున్నాను. అన్నట్లుగనే 25-08-21 తేదీ నాడు 2002 సంవత్సరం నుండి నేటి వరకు జపము వ్రాసిన భక్తులందరికీ ప్రత్యేక ప్రసాద రూపకంగా ఈ విజయమును పంచిపెట్టాడు. నేను సేవకుణ్ణి తప్ప మరేదీ ఆశించకూడదని, సేవే నాకు భాగ్యమని భావించి కళ్యాణాల యందు దృష్టి నిలిపి సేవ చేయుచున్నాను.

## శ్రీవారి దీవెనలను పొందుట :

శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం దసరా – 2002 నుండి ప్రారంభించబడింది. నేనెప్పటికీ స్వామివారికి ఋణపడి ఉండాలని తలంచి, 18వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ తరువాత అంటే దసరా 2020 తరువాత, వెనువెంటనే "శ్రీనివాస కళ్యాణాల" కార్యక్రమమును చేయుదునని తలంచాను. అంటే శ్రీనివాస కళ్యాణాల కార్యక్రమము 2020 దసరా నుండి ప్రారంభమైంది. కాని కోవిడ్-19 కారణంగా, ఇది 20-07-2021న మొదటి కళ్యాణంతో ఈ కార్యక్రమము ప్రారంభించబడినప్పటికీ, శ్రీనివాస కళ్యాణాలలోని నిబంధన ప్రకారం 15-10-21 దసరా వరకు, కనీసం 7 కళ్యాణాలను నిర్వహించాలి, అందుకు నాకు కేవలం రెండున్నర నెలల కాలమే మిగిలింది. చివరికి స్వామివారిని తీవ్రంగా స్మరించి, ఆయన కృపతో దసరా 21 వరకు 8 కళ్యాణాలను చేయగలిగాము. ఇలా గెలిపించినందులకు స్వామికి కృతజ్ఞత తెలుపు సమయాన, చిన్న పిల్లలను గెలిపించి, పెద్దలు సంతోషించునట్లు చిరునవ్వు నవ్వి సంతోషాన్ని తెలిపారు. మరియు కొంత సమయము తరువాత మీ ఇంటికి రాగలనని, ఆ లోపల ఇంటి నిర్మాణానికి కావలసిన పనులు చూచుకొమ్మని కూడా చెప్పారు. శ్రీవేంకటేశ్వర కృపా కటాక్షాలు సిద్ధిరస్తు అంటూ దీవించాడు కూడా.

## హరినామ క్షేత్ర స్థలమును తెలుపుట :

స్వామి వారి హరినామ క్షేత్రం ఎక్కడ నిర్మించాలో తెలుపమని తీవ్రంగా ప్రయత్నించుచున్నాను. లౌకికమైన విషయ వాసనలను పూర్తిగా త్యజించి, స్వామి చెప్పినట్లు నడుచుకుంటూ, సంకల్పసిద్ధే ధ్యేయంగా జీవించుచున్నాను. ఒకానొక సందర్భములో శ్రీవేంకటేశ్వరుడు "నీవు పూజ గదినే పడకగది"గా చేసుకొని జీవించుచున్నావంటూ చమత్కరిస్తూ ప్రోత్సహించాడు. కోరిక సిద్ధించు సమయమాసన్నమైనదని మార్చి 2022న చెప్పాడు. కోవిడ్ 3వ వేవ్ సందర్భంగా కళ్యాణాలకు గ్యాప్ ఇచ్చి 05-04-2022 తేదీ నాడు రెండున్నర నెలల కొరకు మా పిల్లల వద్దకు అమెరికా వెళ్ళాము. అక్కడ కూడా హరినామ క్షేత్రము గురించి తీవ్రంగా ప్రార్థించసాగాను. చివరికి 16-04-2022 తేదీన నీవు విజయం సాధించావని చెప్పుచు, ఈ హరినామ క్షేత్రమును మా గ్రామములోని మా తోటబావి వద్ద ఏర్పాటు చేయవలసిందిగా సూచించారు. వెంటనే నేను కనీసం 7 ఎకరాల స్థలములో దీనిని నా భాగ్యంగా నిర్మించుదునని చెప్పాను. విజయుణ్ణి చేసినందులకు స్వామివారికి కోటి కోటి ధన్యవాదములు తెలుపుకున్నాను.

హరినామ క్షేత్ర స్థలమును సూచించుటతో, 2000 సంవత్సరం నుండి నేటి వరకు పొందుచున్న అన్ని అనుభూతుల యొక్క అర్థం మారిపోయినట్లనిపించింది. గతంలో మా తోటబావిని ఉపయోగించి ఎన్నో అనుభూతులను చూపెట్టాడు. నా మొదటి అనుభూతి 'శ్రీ ఆంజనేయుడు జైశ్రీరాం' అంటూ అక్కడే పైకెగిరాడు. ఒకసారి ఆ ప్రాంతం మొత్తం విలువగలదిగ మారుతుందని, దుకాణాలు, హోటళ్ళతో జనాలు రద్దీగా ఉండగలరని సూచించాడు. ఒకసారి మా తోటబావి దగ్గరికి చేరుటే లక్ష్యంగా సూచించుచు, లక్ష్యాన్ని చేరేవరకు శ్రీవేంకటేశ్వరుని భక్తులతో కలిసి, అత్యంత భక్తిభావంతో సేవించాలని, అవసరమైతే 3వ సంకల్పాన్ని తీసుకునైనా నీవు లక్ష్యాన్ని మాత్రం చేరవలసి ఉంటుందని కూడ సూచించాడు. కాని ఆ రోజులలో దీనిని గ్రహించలేకపోయాను. ఆ ప్రాంతానికి గంగ తన ఒక పాయను తీసుకు రాగలదని సూచించాడు. స్వామి

సూచించినట్లుగనే మిషన్ భగీరథలో భాగంగా గోదావరి నీటి కాలువలు వచ్చుచున్నవి. సిద్ధిపేట మాస్టర్ ప్లాన్ లో భాగంగా పెద్ద రోడ్డు కూడ వచ్చుచున్నది.

## తిరుమల ఆలయ ప్రతిరూపమును సూచించుట:

ఆ తరువాత ఈ ఆలయం ఏ రూపంలో ఉండాలనే ఆలోచన కలిగింది. ఒక నెల రోజులు తర్జన భర్జన పడ్డాను. ఒకసారి స్వామివారి తిరునామం ఆకారంలో నిర్మించాలని భావించాను. నాకు తెలిసిన రక రకాల ఆలయ మోడళ్ళను ఎంచుకున్నాను. కాని తేది 21-05-22 శ్రవణా నక్షత్రం రోజు తనకు తిరుమల ఆలయ ప్రకారమే, దాని ప్రతిరూపమే కావాలని సూచించాడు. నీకు శక్తి లేకపోతే మొదటి రెండు ప్రాకారాల వరకు నిర్మించమన్నాడు. మరే ఇతర ఆలయ ఆకారాలు వద్దన్నాడు. ఆద మరవక ఈ సంకల్పాన్ని పూరించమని కూడ చెప్పాడు. అమెరికాలో మా స్టేను మరొక్క రోజు పొడిగించక, హైదరాబాద్ వచ్చి, నీ కళ్యాణాల సంకల్పమును అత్యంత త్వరగా పూరించమని మరీ మరీ ఆదేశించాడు.

స్వామివారి కృపతో కళ్యాణాల కార్యక్రమము చక్కగా జరుగుచున్నది. కళ్యాణాలను మెచ్చి ఒకానొక సందర్భములో శ్రీవేంకటేశ్వరుడు మాకు మిఠాయి తినిపించాడు. ప్రతి కళ్యాణం వైఖానసాగమోక్తంగా, అన్నమాచార్య కీర్తనల మధ్యన "నమో వేంకటేశాయ" రథయాత్ర యుక్తంగా, చూచేవారికి తిరుపతి వారే కళ్యాణం చేయుచున్నట్లు ఆనందపడుచున్నారు. కళ్యాణాలలో పాల్గొన్న ప్రతి భక్తుణ్ణి స్వామివారు ఎంతో చక్కగా అనుగ్రహించుచున్నారు. తేది 30-07-22 రోజున 21వ కళ్యాణంగా స్వామివారు సూచించినట్లు మా సొంత వూరు



సం2004 లో తిరుపతి లో అప్పటి ఇవో శ్రీఅజయ్ కల్లామ్ గారు నమోవేంకటేశాయ రథమును ప్రారంబించుట

చిన్నగుండవెల్లిలో కళ్యాణం నిర్వహించుచున్నప్పుడు మా తండ్రిని నాకు తోడుగా పంపాడు. కళ్యాణ సమయంలో నేను కూడా ఊరందరిచే తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి మా ఊరిలో శాశ్వత నివాసం ఏర్పరచుకొమ్మని ప్రార్థింపచేశాను. స్వామివారు సంతోషించారు. స్వామివారు సూచించినట్లు మా అమ్మమ్మ గారి గ్రామము, అప్పనపల్లిలో తేది 18-03-2023న 40 వ కళ్యాణమును నిర్వహించాము. మార్చి 23 వరకు 41 కళ్యాణాలను చేశాము. శ్రీవేంకటేశ్వరుని కృపా విశేషం చేత ఈసారి నా సాధన చక్కగా జరుగుచున్నదని, ఎలాగైనా ఈసారి పరీక్షలో తప్పక పాస్ కావాలనే దృఢచిత్తముతో ఉన్నావని శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా తెలిపారు. పూర్వపు సేవలైన ప్రతి సంవత్సరము 7 కోట్ల జప సమర్పణ, శ్రీవేంకటేశం మాసపత్రిక యథావిధిగా జరుగుచున్నవి. మరియు వచ్చే కాలములో శ్రీవారి కృపతో మొత్తం 111 శ్రీనివాస కళ్యాణములను నిర్వహించి, వీటన్నిటి పుణ్యఫలముతో బాటు, భాగవతుల శక్తులను, వారి ఆశీర్వాదములను పొందుచు, తిరుమల ప్రతిరూప ఆలయమును కనీసం రెండు ప్రాకారాల వరకైనా నిర్మించి, స్వామివారిని తిరుమల నుండి హరినామ క్షేత్రమునకు ఆహ్వానించుచు, సిద్ధిపేట వద్ద నున్న చిన్నగుండవెల్లి గ్రామములో స్వామివారు సూచించిన విధంగా హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయుట లక్ష్యంగా పయనించుచున్నాము.

## స్వామివారి చతురత:

శ్రీవేంకటేశ్వరుడు మహాచతురుడు. 2002 సంవత్సరంలో స్వామివారిని నా జీవితాంతం, నేను తృప్తి చెందే వరకు మీ సేవాభాగ్యాన్ని ప్రసాదించుమని వేడుకున్నాను. నేను మీ సేవకుడనని, మీ ఋణం తీర్చుకొనుటే నా భాగ్యంగా భావించి, ఈ జీవితాంతం మీ సేవ చేయుదునని చెప్పాను. దాని ప్రకారం స్వామివారు సేవను ప్రసాదించి, నీ కోరిక ప్రకారం సేవను ప్రసాదించాను, దానిని అత్యంత జాగ్రత్తగా ఏ తప్పూ లేకుండా చేసే బాధ్యత నాపై పెట్టారు. ఆ తరువాత 2020 సంవత్సరంలో మొత్తం 16 సంవత్సరముల సేవా ఫలమును నా చేతనే భాగవతులకు పంచి పెట్టమని దీనాతి దీనంగా ప్రార్థింపచేసి చివరికి భాగవతులకు ఈ ఫలమును నీ ప్రార్థన ప్రకారమే పంచిపెట్టానన్నాడు. పైగా నాకు మరో సంకల్పమిచ్చి నా సేవను నేను కోరినట్లే మరికొన్ని సంవత్సరాల వరకు పొడిగించాడు. ఇది శ్రీవారి చతురతకు నిదర్శనము. నేను పందెంలో ఓడిపోయి దుఃఖించు మరుసటిరోజు, భాగవతుల ఆశీర్వాద ఫలితముగా గెలిచావని చెప్పినప్పటికీ, ఆ రోజు ఆ లీలను నేను అర్థం చేసుకొనక, మరి రెండు నెలలు ఓడిపోయాననే దుఃఖముతో స్వామి కృపను పొందుటకు క్షణం విడువక రకరకాలుగా ప్రయత్నించాను. చివరికి స్వామివారు ఆశించిన పట్టుదల, తిరిగి లక్ష్యాన్ని

సాధించాలనే బలమైన కోరిక నా మూలంలో కలిగిన తరువాత ఈ లీల యొక్క సరైన అర్థమును చెప్పారు. "నేను ముందే చెప్పాను కాని నీవు అర్థం చేసుకోలేదు, అది నీ తప్పు" అంటూ ఒకప్రక్క నాపై ప్రేమను ఒలకపోస్తూ మరోప్రక్క తాను ఆశించిన మార్పు నాలో కలిగించారు. ఇది ఆయన చతురతకు మరో నిదర్శనం.

## ఒక భావన :

నిజానికి మొదట శ్రీవేంకటేశ్వరునికి ఈ జన్మలో ఆయన ఋణం తీర్చుకొనుటకే ఈ సేవను ప్రారంభించాను. భవిష్యత్తులో ఈ సేవ నుండి ప్రక్కదారి పట్టకూడదని మాత్రమే ఒక సంకల్పము కోసం వెతికాను. అప్పుడు తనకు బొట్టుపెట్టే సంకల్పం తీసుకొమ్మని శ్రీవేంకటేశ్వరుడు సూచించాడు. వెంటనే బొట్టుపెట్టి నేనెందుకు వదులుతాను? మిమ్మల్ని మా ఇంటికి ఆహ్వానించుదునని అన్నవాణ్ణి, రేపు స్వామివారు నిజంగా మా ఇంటికి వచ్చిన తరువాత ఆయనను దర్శించి, పాదపూజ చేసిన తరువాత తిరిగి తిరుమలకు వెళ్ళమని చెప్పగలనా? నాకు నోరు వచ్చునా? స్వామివారిని ఇక్కడే ఉండమంటే... స్వామివారు ఎక్కడ ఉండాలి? ఆయన తిరుమలలో ఎలాంటి ఇంటిలో, ఎలాంటి సౌకర్యములను అనుభవించుచున్నారో నాకు వీలైనంతవరకు అలాంటి ఇల్లును, సౌకర్యములను ఏర్పాటు చేయుట నా బాధ్యతగా భావించాను. అందుకే తిరుమల ఆలయ ప్రతిరూపమును ఎంచుకొని, అక్కడి సాంప్రదాయములనే కొనసాగించాలని భావించాము.

## స్వామివారి దిశా నిర్దేశం :

శ్రీవేంకటేశ్వరుడు ఈ హరినామ క్షేత్రాన్ని ఎంతో పట్టుదలతో సాధించాలనుకుంటున్నాడు. ఆయన ఆదేశానుసారం నడుచుకొనుచు, అత్యంత కఠినంగా జీవించుచు ఎలాగైనా సాధించమన్నారు. 2017 సంవత్సరం నుండి నాలో ఏ లోపము లేనప్పటికీ శారీరకంగా చాలా చిక్కిపోవుచున్నాను. శ్రీవేంకటేశ్వరుడు మాత్రం నాతో 1985లో ఇంజనీరింగ్ చదివిన మిత్రులను చూపుచు, "చూడు వారు నాడు ఏవిధంగా ఉన్నారు, నేడు ఏవిధంగా ఎదిగి బొజ్జలు పెంచి ఉన్నారు అంటూ వారిది 1985 లోని రూపంతో నేటి రూపమును పోల్చేవారు. నన్ను కూడా అప్పటి రూపంతో నేటి రూపమును పోల్చుచు, వారు వారి రంగములో ఎదిగారు, నీవు నీ ఆధ్యాత్మిక రంగంలో ఎదగవలసి ఉన్నది అంటూ నా భౌతిక రూపమును ఆధ్యాత్మిక ఎదుగుదలతో పోల్చుచు దిశా నిర్దేశం చేసేవారు.

## భాగవతుల ఆశీర్వాదమును పొందుమని సూచించుట :

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన అనుభూతులను ప్రచురించమని సెప్టెంబర్ 2022 చివర సూచించాడు. తేది 05-10-22 దసరా నుండి, మరొక్కసారి స్వామివారి అనుభూతులను చదువుటను ప్రారంభించినప్పుడు ఒక అధమశ్రేణి వ్యక్తినైన నన్ను ఎన్నుకొని మీ అమూల్యమైన అనుభూతులను చూపి మీ లక్ష్యాన్ని సాధించుకొను దిశకు తీసుకువెళ్ళుచున్నందులకు ధన్యవాదాలు తెలిపి, ప్రభూ! లక్ష్యసాధనలో నా ఒక్కని శక్తి సరిపోదు. భాగవతుల ఆశీర్వాదముతో పాటు వారి వారి శక్తులను కూడగట్టుకొనుటకు మీ అనుభూతుల ప్రచురణను వాడుకుంటాను. ఆజ్ఞ ఇవ్వమని వేడుకున్నాను. దానికి శ్రీవేంకటేశ్వరుడు ఎంతో సంతోషించాడు. శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామివారిని, వారి శిష్య బృందముతో పంపి దివ్య ప్రబంధ పారాయణము చేయించి మంగళా శాసనములు చేయించాడు. తరువాత నాకు ఏ విధంగా అయితే మరణశయ్యపై ఉన్న వ్యక్తి నిజం మాత్రమే చెప్పునో అదే విధంగా చెప్పమన్నారు.

## శ్రీవేంకటేశ్వరుని శిక్షణ: మచ్చుకు రెండు నెలలు

శ్రీవేంకటేశ్వరుని శిక్షణ అత్యంత గంభీరంగా, కఠినంగా ఉంటుంది. ఏమి చెప్పదలచుకున్నాడో ఆ పరిస్థితిని కల్పించి దానిని అనుభవింప చేయుచు హితోపదేశం చేస్తాడు. ఇక్కడ కూడ నాకు మరణశయ్యపై నున్న పరిస్థితి కల్పించి చెప్పాడు. ఆయన శిక్షణలో కొన్ని లీలలను చెప్పదలచుకున్నాను. 09-10-2022 తేది నుండి 10-12-2022 వరకు, రెండు నెలల కాలము స్వామి ప్రసాదించిన శిక్షణను తెలుపుచున్నాను. తేది 09-12-2022 రోజున రెగ్యులర్ చెకప్‌లో భాగంగా మా డాక్టర్ పరిశీలించి నా హృదయములో మల్టిపుల్ బ్లాకేజీలు ఉన్నవని, యాంజియోగ్రామ్ చేసుకోవాలని, అప్పుడు అవసరాన్ని బట్టి స్టంట్స్ కాని, బైపాస్ కాని చేయవలెనన్నాడు. ఈ విషయం తెలిసిన వెంటనే నేను నా భార్య చాలా బాధపడ్డాము. విరక్తికి లోనైనాము. జీవితం పైన ఆశ తగ్గింది. ఆస్తులు అంతస్తులు ఎందుకు? ఈ భూమి డబ్బు ఏమి చేసుకొనుటకు అనిపించింది. చివరికి నా ప్రభువు శ్రీవేంకటేశ్వరుణ్ణి తీవ్రంగా రకరకాలుగా ప్రార్థించాను. నాకున్న సర్వదాస్తిని మరోమారు ఆయనకు ధారపోశాను. కనీసం స్వామివారి సంకల్పం నెరవేరే వరకు జీవితాన్ని పొడిగించమని దీనంగా వేడుకున్నాను. ఈ పొడిగించిన జీవితం కేవలం మీ సంకల్పాన్ని నెరవేర్చుటకే వినియోగిస్తామని మాట ఇచ్చాను. కాని ఈ నాటి కలలో నన్ను మా ఇంటిలో ఏదో ఒక పవిత్ర కార్యం మొదలు పెట్టుటకని పవిత్రస్నానం చేయించాడు. తెల్లవారి ఈ పొంతన లేని లీల వల్ల హృదయ బ్లాకులు స్వామి వారి లీల మాత్రమే అని అర్థమైంది. శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞ లేనిది ఏదీ జరుగదని భావించి, వెంటనే హాస్పిటల్ కు వెళ్దామని చెప్పుచున్న నా భార్యను ఏమీ కాదని ఊరడించాను. కొన్ని ఆయుర్వేద ఉపచారాల తరువాత 20-25 రోజుల తరువాత వెళదామన్నాను. తెల్లవారి నేను అనుకోకుండా నా భార్యతో ఇలా చెప్పాను – గతంలో 2009 సంవత్సరంలో అనుభూతులు ప్రచురించుచున్నప్పుడు వ్యక్తిగతమైనవి, కుటుంబ విషయాలు, చెప్పరానివి, చెప్పగలిగేవి అంటూ భేదం లేకుండా చెప్పానని బాధపడ్డావు. ఈసారి ఆ విధంగా చేయరాదని "మరణశయ్యపైనున్న వ్యక్తి చెప్పేవి అన్నీ

నిజాలే'' అనే చందంగా చెప్పాలని, అందుకు తనకు ఏమి అభ్యంతరము లేదని స్వామిని ప్రార్థించితే సరిపోతుందని అప్రయత్నంగా అన్నాను. ఆమె అలాగేనని స్వామి వారిని ప్రార్థించుచున్నది. ఈలోగా నాకు మరికొంత శిక్షణను ఇచ్చుచున్నాడు. తేది 16-10-22 నాడు పరీక్షలో పాస్ అగుటకు సర్వవిధాల ప్రయత్నించుచున్నట్లు చెప్పుచు, ఇదే స్థితిని కొనసాగించమన్నాడు.

తేది 22-10-22 ఈ రోజు మరో లీలను ప్రసాదించాడు. దీనిలో ప్రతి లీలలో కొంత కొంత చొప్పున అంచెలంచెలుగా యోగ్యతను ప్రసాదించుచున్నానన్నాడు. చివరికి తాను ఆశించిన స్థాయి వరకు ఈ లీలలు కొనసాగగలవని చెప్పాడు.

ఈ మధ్యన తీవ్రమైన సమస్యల వలయంలో చిక్కుకున్నాను. ఆఫీసులో స్టాఫ్ కొరత, కొత్తగా వచ్చిన భూ సమస్య, భూ సమస్యతో పోలీసు కేసు కావడం, ఆరోగ్య సమస్య, మా కుటుంబ సమస్య ఇలా దమ్ము తీసుకోలేని విధంగా సమస్యల వలయంలో ఇరుక్కున్నాను. స్వామివారిని తీవ్రంగా ప్రార్థించుచున్నాను. శరణు వేడుచున్నాను. మీ సంకల్పం తీర్చుటే నా ధ్యేయం అని నా సమస్యలను తీర్చమని పదే పదే దీనాతి దీనంగా వేడుకుంటున్నాను. రక్షించమని ప్రాధేయపడుచున్నాను. చివరికి 27-10-22 ఉదయం ఈ విధంగా స్వామివారు అన్నారు. ''రోజంతా భక్తుడు మాధుర్యాన్ని అనుభవించుతాడు'' అంటే నేను స్వామిని ఈ విపత్కాల పరిస్థితులలో స్మరించి స్మరించి మాధుర్యాన్ని అనుభవించాలని మరియు నాలో కొంత ఆధ్యాత్మిక వృద్ధి, స్వామిపట్ల మరింత అంకిత భావం, ప్రేమ ఏర్పడుటకు ఈ సంఘటన జరుగుచున్నదనిపించింది.

తేది 29-10-22 నన్ను మా ప్రాంతపు భక్తుల బృందానికి ప్రెసిడెంట్ గా ఎన్నుకొని వారికి శ్రీవేంకటేశ్వరుని కృపా కటాక్షాలను అందించవలసిన బాధ్యత నాదనే విధంగా సూచించాడు. ఎలాగైతే ఒక ఊరికి సర్పంచిగా ఎన్నికైన వ్యక్తి ఆ ఊరి అభివృద్ధి కోసం పాటుపడతాడో, నీవు ఆ విధంగా భక్తులకు శ్రీవేంకటేశ్వరుని కృపను అందించుటకు పాటుపడమన్నాడు.

తేది 01-11-22 నాడు దీనాతి దీనంగా వేడుకొన్నాము. ఎన్నో సమస్యల్లో చిక్కి ఉక్కిరి బిక్కిరి అవుచున్నాము. శ్వాస తీసుకొనుటకు కూడా కష్టంగా ఉన్నది. హృద్రోగ సమస్యతో రేపటి ఉదయాన్ని చూడగలనా? అనే అనుమానం కలిగింది. దీనిని గమనించి స్వామివారికి రకరకాల శరణాగతి చేశాను. తప్పులు క్షమించమన్నాను. ఆయన చెప్పినట్లు వింటానన్నాను. నేను వ్రాయబోయే స్వామి లీలలను ఉన్నది ఉన్నట్లుగా మార్పులు చేర్పులు లేకుండా తెలుపుదునని మాట ఇచ్చాను. చివరికి ఒక వరము అడిగాను. స్వామివారు నాకు అప్పచెప్పిన సంకల్పమును నెరవేర్చిన తరువాత తీసుకెళ్ళమని మరియు ఈ జన్మలో మిమ్ములను పొంది, మీతో మాట్లాడి, మీ పాదపూజ చేసిన తరువాతనే తీసుకెళ్ళమని వేడుకున్నాను. అనుకున్నట్లుగనే ఈ రాత్రి కలలో మా ఇంటికి శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయరు స్వామివారు వారి వ్యక్తిగత సహాయకునితో కలిసి వచ్చి దీనంగా కూర్చున్నారు. వారి సహాయకుడు నా వద్దకు వచ్చి నా యొక్క ఫేస్ బుక్ లాంటి అకౌంట్ కావాలని అడిగాడు. అందుకు నేను బాధతోనే నిరాకరించాను. నేను నా స్వామివారి అనుభూతులను ప్రచురించబోతున్నానని, ఆ అకౌంటు నాకు అవసరమని, స్వామి సంకల్పం నెరవేర్చిన తరువాత ఇవ్వగలనన్నాను. అకౌంట్ కావాలని వారు, ఇవ్వనని నేను కొన్ని గంటల తరబడి వాదం జరిగింది. చివరికి వారు వెళ్ళిపోయారు. జీయరు స్వామివారు కాలుని రూపములో నన్ను పై లోకమునకు తీసుకెళ్ళుటకు వచ్చారు. కాని నేను దీనిని సరిగా అర్థం చేసుకోలేదు. తేది 03-11-22న మరో కల కన్నాను. ఇందులో కూడ నా జీవితము పొడిగించబడ్డది. నేను ఒక రైలులో ప్రయాణించుచున్నాను. మనము దిగే స్టేషన్ రాగానే ఒక శక్తి బయటకు నెట్టివేయుచున్నది. ఒక స్టేషన్ లో నన్ను బైటికి నెట్టివేసింది. కాని రైలు ద్వారము వద్దకు రాగానే ఆ పరిసరాలు చూచి, ఇది నేను దిగే స్టేషన్ కాదని దిగక, కిటికీ రాడ్ పట్టుకుని వ్రేలాడుచు ప్రయాణించుచున్నాను. ఇంతలో ఎదురుగా ఒక నల్లని మరో ఇంజన్ లో ఈ రైలు యజమాని వచ్చి నన్ను లోనికి తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు. అంటే నా జీవితానికి పొడిగింపు లభించింది.

చివరికి ఎంతో బాధతో జీవిస్తున్న నేను 07-11-22 నాడు స్వామివారితో ఇలా ప్రార్థించాను. ప్రభూ! మీరు నా అన్ని సమస్యలను తీర్చుదురని మాట ఇచ్చారు. కాని నేను వీటికి భయపడుచున్నాను. మీ నిజమైన భక్తుడు భయపడడు. నాకు యోగ్యత లేదు. మీరు ఆశించిన స్థాయికి రాలేకపోయాను. నేను అయోగ్యుణ్ణి. మిమ్ములను పొందే స్తోమత, అర్హత నాకు లేదు. కాబట్టి మిమ్ములను పొందాలనే కోరికను నేను సంపూర్ణంగా విరమించుకుంటున్నాను. నన్ను క్షమించమని వేడుకున్నాను కాని మీరు ఇచ్చిన సంకల్పమును మాత్రము నెరవేరుస్తానని ప్రమాణం చేశాను. నిజానికి నేను స్వామివారి సేవనే కోరుకున్నాను కాని స్వామివారిని కాదు. స్వామివారిని పొందుట బోనస్ లాగా అనుకున్నాను. స్వామిని పొందాలనే కోరికతో ఏ పని, సేవ చేయకుండా నా కర్తవ్యంగా సేవ చేయాలని భావించాను.

చివరికి తేది 12-11-22 రోజున స్వామి ప్రేరణతో హాస్పిటల్ కు వెళ్ళాము. నాకు రెండు స్టంట్స్ వేయడంతో నా జీవితానికి పొడిగింపు లభించింది. అత్యంత క్లిష్ట పరిస్థితులలో ఈ స్టంట్స్ ను వేశామని డాక్టర్ చెప్పినప్పుడు స్వామివారి లీలలు మరోమారు గుర్తుకు వచ్చాయి. చివరికి ఈ పొడిగింపు జీవితాన్ని స్వామి సంకల్ప సాధనకు మాత్రమే వినియోగించుదునని మరోమారు

ప్రమాణం చేశాను. ఈ విధంగా స్వామివారు అత్యంత కఠినమైన శిక్షణను ఇచ్చుచున్నారు.

మరో విషయం, ఈమధ్యన, నవంబర్ 2022 నుండి మరింత సన్నబడ్డాను. చూచిన ప్రతివ్యక్తి ఎందుకు సన్నబడ్డావని అడిగినప్పుడల్లా "నీవు ఎదగాలని" శ్రీవేంకటేశ్వరుని మాట నా హృదయములో మారుమ్రోగుచు వినబడుచున్నది. ఈ విధమైన కఠిన శిక్షణను శ్రీవేంకటేశ్వరుడు తన హరినామ క్షేత్ర ఏర్పాటు నిమిత్తమై ఇచ్చుచున్నారు.

ఈ మధ్యన టిటిడి వారు వైకుంఠ ఏకాదశికి 10 రోజుల పాటు ఉత్తర ద్వార దర్శనమును కల్పించారు. హరినామ క్షేత్రము నిర్మాణము కోసమని, స్వామివారి వైకుంఠ ద్వారము లోపలి భాగాలను ఒక ఇంజనీరింగ్ మైండ్ తో చూచే నిమిత్తమని మరియు స్వామివారిని వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవాలని, అన్నిటికంటె ముఖ్యంగా అనుభూతులను "తిరుమల శ్రీవేంకటేశ్వరుని దశ-నా దశ" అనే శీర్షికతో ప్రచురణ గురించి స్వామివారి ఆశీర్వాదం పొందుటకని తిరుపతికి తేది 09-01-2023న, నేను, నా భార్య వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నాము. ఆ రోజు ఉదయం "నీవు ఆశీర్వాదమును పొందుటకు వచ్చుచున్నావు సంతోషం" అనే విధంగా హృదయాంతరంగం నుండి అనుభూతిని పొందాను. మరియు నా భార్యకు తేది 10.01.2023 ఉదయం "నేను మీ ఇంటికి వచ్చుచున్నా"నని కలలో తెలియజేశాడు. ఈవిధంగా మా ఇద్దరికీ ఎంతో ఆనందకరమైన విషయము తెలిపి సంతోషపరిచాడు.

## స్వామివారు ప్రసాదించిన అనుగ్రహము : మచ్చుకు ఒకటి..

స్వామివారు ప్రసాదించిన ఒక అనుగ్రహాన్ని కూడా మచ్చుకు తెలుపుచున్నాను. నాకు తన పాద సేవాభాగ్యాన్ని ప్రసాదించాడని చెప్పాను. అది ఎలా జరిగిందంటే స్వామివారు ఆకాశం నుండి దిగి, నేరుగ మా ఇంటికి వచ్చి, నా ముందు ఆసీనులై, తన రెండు కాళ్ళను నా ముందు పెట్టి, పంచెను మోకాళ్ళ వరకు పైకెత్తి, ఈ పాదాలు నీవి సేవించుకో అన్నాడనుకుంటే ఈ భాగ్యం ఎవరికి లభిస్తుంది? ఎంత అదృష్టం ఉంటే లభిస్తుంది? ఇలాంటి అనుగ్రహాలను ఎన్నో పొందాను.


## భాగవతుల ఆశీర్వాదము :

ఈ భాగంలోని మొదటి రెండు వాక్యాలు సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడు సూచించగా నేను మొదలుపెట్టాను. ఈ అనుభూతులను కేవలము మీ ఆశీర్వాదము పొందుటకే, శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే మాత్రమే వ్రాయుచున్నాను.

ఇంకా ఈ భాగంలో ఎన్నో విషయాలు చెప్పాల్సి ఉన్నప్పటికి తేది 14-3-2023 నాడు 'గో...వింద' అని సూచించుచు ఇక చాలు అన్నారు. ఇలా స్వామి వారు నా వెనుక ఉంటు ప్రేరణ కలిగించుచున్నప్పటికి నేను తగిన సాధన చేయవలసి ఉంటుంది.

కళ్యాణాల కార్యక్రమమును ప్రసాదించినప్పుడు శ్రీవేంకటేశ్వరుడు నన్ను శ్రీ భరతుణ్ణి అనుసరించమన్నాడు. భరతుడు మహాభక్తుడు. శ్రీరాముని కొరకు తపించిపోయాడు. శ్రీరాముని పాలనను అయోధ్య వాసులకు అందించుటకు, ఒక్క రోజు ఆలస్యమును సైతం సహించనంతగా తపించిపోయాడు. అంతటి తపన, భక్తి నన్ను పెంచుకోమన్నారని అర్థం. శ్రీవేంకటేశ్వరుణ్ణి పొందుటకు అత్యంత తపనను కలిగి ఆయనపై అమితమైన వ్యామోహాన్ని పెంచుకోవాలి. అప్పుడే ఈ హరినామ క్షేత్రం సాధ్యమౌతుంది. దీనిని సాధించుటకు నా ఒక్కరి శక్తి సరిపోదు. కాబట్టి శ్రీవేంకటేశ్వరుని భక్తుల యొక్క శక్తిని, ఆశీర్వాదమును కాంక్షించుచున్నాను. హరినామ క్షేత్రము ఏర్పాటులో, నిర్వహణలో, స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటలో మీ సహకారాన్ని కోరుచున్నాను.

**ఈ శ్రీవేంకటేశ్వరుని అనుభూతులను చదివిన ప్రతిభక్తుడు, వయస్సు, లింగభేదం లేకుండా శ్రీవేంకటేశ్వరుణ్ణి 3 సార్లు స్మరించి నన్ను ఆశీర్వదించవలసిందిగా ప్రార్థించుచున్నాను. మరియు ప్రతినెల మేము ప్రచురించు స్వామివారి అద్భుతమైన లీలలను చదువుచు, ప్రస్తుతపు కలియుగములో కూడా ఆయన భక్తవత్సలతను తెలుసుకుంటూ, స్వామివారి కోరిక ప్రకారం, మరో తిరుపతిని ఏర్పాటు చేయుటకు, ప్రతి భక్తుడు ఈ సంకల్పం నెరవేరాలనే ప్రార్థనతో పాటు, ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములు కాగలరని, స్వామి కృపను పొందగలరని ఆశించుచున్నాము. వచ్చే భాగములో ప్రభావవంతమైన స్వామివారి లీలలను క్లుప్తంగా తెలిపెదను. ఆ తరువాత ఒక్కొక్కటి వివరించెదను. నమో వేంకటేశాయ**



**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**

**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**

**1-1-53, వీధి నెం.1, హబ్సిగూడ, హైదరాబాద్. ఫోన్. 040-27175050**

**Email: srivenkatesham@gmail.com**

**Visit : www.Srivenkatesham.org**



# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ.. నా దశ

ప్రతి నెల ప్రచురించు ఈ అనుభూతుల హాట్ కాపీ కోరువారు ‘శ్రీవేంకటేశం’
మాస పత్రికకు సూచించిన విధంగా చందాదారులుగా కాగలరు.
1 సం|| చందా రూ. 250/-, 2 సం|| చందా రూ. 500/-, 4 సం|| చందా రూ. 1,000/-,
జీవిత చందా రూ. 3,500/-, రాజ పోషకులు రూ. 5,116/-
9348212354 నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్ పే మరియు పేటీఎం ద్వారా
డబ్బు, మీ అడ్రస్ పంపగలరు

